# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

20.2.2026 శుక్రవారం FRIDAY | సంపుటి (volume): 1 సంచిక (Issue): 218 | పేజీలు : 12 Pages : 12 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana









## ప్రధాని అవుతావు

ప్రియాంక గాంధీకి బాబా దీవెనలు 4



## ఉచిత పథకాలపై మరోమారు సుప్రీం సీరియస్ 4



# దేవ్‌జీ లక్ష్యంగా కూంబింగ్



## కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్

### ఐదురుగు మావోలు మృతి చెందినట్లు గుర్తింపు

ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాల కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతిచెందారు. మావోయిస్టు అగ్రనేత, ఆ పార్టీ కార్యదర్శి దేవ్ జీ లక్ష్యంగా కర్రెగుట్టల అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. కర్రెగుట్టల్లో తలదాచుకున్న మావోయిస్టులు.. ఈ విషయాన్ని గమనించి భద్రతా బలగాలపైకి కాల్పులు జరిపారు. 2

## దక్షిణ మండల విద్యుత్ సంస్థలో

# కొత్త కనెక్షన్ల అవినీతి

- 8మంది ఇంజనీర్లను సస్పెండ్ చేస్తే ఉత్తర్వులు
- తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం

తెలంగాణ దక్షిణ మండల విద్యుత్ సంస్థలో అవినీతికి పాల్పడిన అధికారులపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. డిజిటల్ చెల్లింపుల ద్వారా లంచాలు తీసుకున్న వ్యవహారం బయటపడటంతో 8 మంది ఇంజినీర్లపై సస్పెన్షన్ వేటు పడింది.. విజిలెన్స్ విచారణలో అవినీతి ఆరోపణలు నిజమని తేలడంతో ఈ చర్యలు తీసుకుంది. ఈ ఘటన విద్యుత్ శాఖలో తీవ్ర చర్చకు దారి తీసింది. ప్రజలకు సేవలందించే కీలక విభాగంలో అవినీతి చోటుచేసుకోవడం ఆందోళనకరంగా మారింది. 2

# జస్ట్.. 'నామ్ కే వాస్తే'!

- మున్సిపాలిటీలో 'వార్డు కమిటీ'లు ఏర్పాటు 'పేపర్ మీదే'నా.?
- ఏడాదికి 'నాలుగు మీటింగ్'లు పెట్టాలనేది 'చట్టం'
- ఏడాదికి 'ఒక్క మీటింగ్' కూడా పెట్టిన పాపాన పోలేదు ఈ మున్సిపల్ 'చుట్టాలు'
- 'వార్డు కమిటీ'లు ఎక్కడ? 'వార్డు ఆఫీసర్ల' జాడ ఏడ?
- 'వార్డు కమిటీ'ల మీటింగ్'కయ్యే 'ఖర్చులు' ఎవరి జేబుల్లోకి.!?

12




# బడ్జెట్‌లో నిధులు ఇవ్వాల్సిందే!



- రెండేళ్లుగా తెలంగాణ ప్రజలను నిట్టనిలువునా మోసం చేశారు
- మహిళల 2500, రైతుబంధు 15 వేలు, పెన్షన్ల పెంపు ఏమైంది?
- హామీల అమలుపై సీఎం రేవంత్‌కు ఘాటైన లేఖ

3

# ఏఐ మనల్ని శాసించొద్దు..

## మనమే ఏఐని శాసించాలి



- ఏఐ అంటే కేవలం టెక్నాలజీ కాదు.. అదొక పరివర్తన శక్తి!
- విధ్వంసానికి తావులేకుండా 'మానవ్ విజన్'తో ముందుకు..
- 'ఇండియా ఏఐ సమ్మిట్'లో ప్రధాని మోడీ పిలుపు

4

# డిజిటల్ రంగంలో భారత్ విప్లవాత్మక మార్పులు

- అధికవడ్డీ రుణాలపై వడ్డీ తగ్గింపు..
- ఆవిష్కరణలు ఆర్థిక వ్యవస్థ వృద్ధికి తోడ్పాటు
- ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో టెక్ దిగ్గజాల వెల్లడి



4



# 'ప్రజల తెలంగాణే'

# కాంగ్రెస్ కార్యాచరణ

## ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

- మున్సిపల్, స్థానిక ఎన్నికల విజయంపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులకు అభినందన
- మేడారం చరిత్రపై ఆసక్తి చూపిన రాహుల్ గాంధీ.. సీతక్కకు ప్రత్యేక ప్రశంసలు
- మేడారం వీరగాథపై సినిమా తీయాలని సూచన!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** సమానత్వంతో కూడిన తెలంగాణ నిర్మాణం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, 'ప్రజల తెలంగాణ' లక్ష్యాన్ని సాధించే దిశగా కార్యాచరణను రూపొందించినట్లు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. సామాజిక సంక్షేమం, ఆర్థిక సాధికారత, ప్రతి పౌరుడికి న్యాయం అందించడం తమ ప్రధాన సంకల్పమని ఆయన వెల్లడించారు. ఢిల్లీలోని మల్లికార్జున ఖర్గే నివాసంలో తెలంగాణ కాంగ్రెస్‌కు సంబంధించిన కీలక సమీక్ష సమావేశం జరిగింది. పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ కూడా పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు పలువురు మంత్రులు శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి వెంకట రెడ్డి, దామోదర రాజనర్సింహా, అడ్లూరి లక్ష్మణ్, అజహరుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండా

మిగతా 2 లో




## 26 నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు

తొలిరోజు గవర్నర్ ప్రసంగంతో ప్రారంభం

28న బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న భట్టి 2

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI

కరీంనగర్ | శుక్రవారం 20 ఫిబ్రవరి 2026




# 26 నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు

### తొలిరోజు వర్నర్ ప్రసంగంతో ప్రారంభం

### 28న బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న భట్టి

**హైదరాబాద్, ఫిబ్రవరి 19 :** తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తేదీ ఖరారైంది. ఈనెల 26 నుంచి శాసనసభ సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి రోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగించనున్నారు. మరుసటి రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగనుంది. ఫిబ్రవరి 28న అసెంబ్లీలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. సారి సభను 10 నుంచి 15 రోజులపాటు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. బడ్జెట్ రూపకల్పనపై సర్కార్ కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో శాఖల వారీగా ప్రీ బ్జడెట్ సమావేశాలను పూర్తి చేశారు. అన్ని శాఖల మంత్రులు, అధికారులతో మంత్రి భట్టి విక్రమార్క సమీక్షలు నిర్వహించారు. ఈసారి బ్జడెట్‌లో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేయనున్నట్లు తెలుస్తోంది. రైతు సంక్షేమం, మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి వంటి ఆరు గ్యారంటీల అమలుకు భారీగా నిధులు కేటాయించే అవకాశం ఉంది. కొత్త సంక్షేమ పథకాలు, నీటిపారుదల, మౌలిక సదుపాయాలు, పట్టణాభివృద్ధి వంటి అంశాలపైనా ప్రభుత్వం దృష్టి సారించనుంది. ఈసారి అసెంబ్లీ సమావేశాల్లో పెన్షన్ల విషయంలో కీలక నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. ఇక, ఈనెల 23న సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరుగనుంది. ఈ కేబినెట్‌లో బ్జడెట్ సమావేశాలపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# పంజాగుట్ట చట్నీస్ మెట్ల వ్యవహారం

### హైడ్రా జోక్యంతో పరిష్కారం




**హైదరాబాద్, ఫిబ్రవరి 19 :** హైదరాబాద్‌లోని చట్నీస్ పంజాగుట్ట బ్రాంచ్‌లో దశాబ్ద కాలంగా నెలకొన్న వివాదానికి హైడ్రా అధికారులు తెరదించారు. చట్నీస్ హోటల్ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా మూసివేసిన మెట్ల మార్గాన్ని హైడ్రా అధికారులు గురువారం తెరిపించారు. పదేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఈ సమస్యపై హైడ్రా తీసుకున్న నిర్ణయం స్థానికంగా పెద్ద చర్చకు దారితీసింది. పంజాగుట్టలోని చట్నీస్ హోటల్ నిర్వాహకులు భవనంలోని పై అంతస్తులకు వెళ్లే మెట్ల మార్గాన్ని నిబంధనలకు విరుద్ధంగా మూసివేసి అడ్డంకులు సృష్టించారని బాధితులు ఆరోపించారు. ముఖ్యంగా కరోనా లాక్‌డౌన్ సమయం నుంచి పైఅంతస్తుల్లోని ఇతర యజమానులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, పూర్తిగా తమ గుప్పిట్లోకి తీసుకున్నారని తెలిపారు. గత పదేళ్లుగా భవనంలోని ఇతర యజమానులు తమ వ్యాపారాలకు, రాకపోకలకు ఆటంకం కలుగుతోందని జీహెచ్ఎంసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని తెలిపారు. అయితే ఈ సమస్యపై బాధితులు ఇటీవల హైడ్రా అధికారులను ఆశ్రయించారు. ఫిర్యాదును స్వీకరించిన హైడ్రా బృందం ఇవాళ క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, వెంటనే ఆ మెట్ల మార్గాన్ని తెరిపించారు. హైడ్రా రాకతో తమ సమస్య పరిష్కారానికి మార్గం సుగమం అయిందంటూ బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# గద్దర్ జ్యూరీ కమిటీలో మార్పు

### స్పెషల్ అవార్డ్స్' విభాగం జ్యూరీ చైర్మన్‌గా తమ్మారెడ్డి



**హైదరాబాద్, ఫిబ్రవరి 19:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సినిమా రంగానికి ఇచ్చే అత్యున్నత పురస్కారాలైన గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ పక్రియను వేగవంతం చేసింది. ఈ క్రమంలో జ్యూరీ కమిటీలో కీలకమైన మార్పు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్‌లో భాగంగా ఇచ్చే 'స్పెషల్ అవార్డ్స్' విభాగం జ్యూరీ చైర్మన్‌గా ప్రముఖ నిర్మాత, విశ్లేషకుడు తమ్మారెడ్డి భరద్వాజాను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నియమించింది. ఇప్పటి వరకు ఈ బాధ్యతల్లో ఉన్న లెజెండరీ దర్శకుడు కె. రాఘవేంద్రరావు స్థానంలో ఇప్పుడు తమ్మారెడ్డి భరద్వాజ బాధ్యతలు స్వీకరించనున్నారు. చలనచిత్ర పరిశ్రమలో తమ్మారెడ్డికి ఉన్న సుదీర్ఘ అనుభవం, సామాజిక అంశాలపై ఆయనకున్న అవగాహనను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రజా గాయకుడు గద్దర్ స్మారకార్థం తెలంగాణ ప్రభుత్వం ఈ అవార్డులను ప్రవేశపెట్టింది. గద్దర్ పేరుతో ఇస్తున్న ఈ అవార్డులు తెలుగు చిత్ర పరిశ్రమలో నూతన ఉత్తేజాన్ని నింపనున్నాయి. ముఖ్యంగా తెలంగాణ సంస్కృతి, కళలను ప్రతిబింబించే చిత్రాలకు ఈ అవార్డులలో ప్రాధాన్యత దక్కే అవకాశం ఉంది. గతంలో ఉన్న నంది అవార్డుల స్థానంలో ఈ నూతన అవార్డులను ప్రతి ఏడాదీ అందించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. 2024 - 25 సంవత్సరంలో విడుదలైన సినిమాలలో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన నటీనటులు, సాంకేతిక నిపుణులను ఎంపిక చేయనున్నట్లు సమాచారం.

# 'ప్రజల తెలంగాణ' లక్ష్యమే కాంగ్రెస్ కార్యాచరణ

మొదటి పేజీ తరువాయి



సురేఖ, ఉత్తమ్ కుమార్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రోగ్రెస్ రిపోర్ట్, పార్టీ ప్రస్తుత పరిస్థితులు, ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు, భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలపై సమగ్రంగా చర్చ జరిగింది.సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అభినందించారు. ముఖ్యంగా తెలంగాణ మున్సిపల్ ,స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన ఘనవిజయం నేపథ్యంలో ఈ సమీక్ష సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకున్నామని, ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ కచ్చితంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశానికి సంబంధించిన వివరాలను మల్లికార్జున ఖర్గే తన అధికారిక ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఘనవిజయం సాధించిందని, రాష్ట్ర నాయకులు, మంత్రులతో కలిసి సమగ్ర సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ప్రజల ఆశయాలను నెరవేర్చే దిశగా తదుపరి కార్యాచరణపై చర్చించామని, సామాజిక సంక్షేమం, ఆర్థిక సాధికారత, అందరికీ న్యాయం అనే లక్ష్యాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రతి పౌరుడి ఆకాంక్షలను సాకారం చేస్తూ సమగ్ర తెలంగాణ నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. సుమారు 2 గంటలపాటు భేటీ కొనసాగింది. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. సీఎం, మంత్రులు, నాయకులతో సమగ్ర సమీక్ష నిర్వహించాం. సామాజిక సంక్షేమం, ఆర్థిక సాధికారత, అందరికీ న్యాయం చేయడంతో పాటు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నాం. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం అని ఖర్గే పేర్కొన్నారు. ఈ సమావేశంలో మేడారం జాతరను ఘనంగా నిర్వహించినందుకు మంత్రి సీతక్కను కాంగ్రెస్ అగ్రనేతలు అభినందించారు. ఆదివాసీల అతిపెద్ద జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం జాతరపై సుమారు పది నిమిషాల పాటు చర్చ జరిగింది. సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ.. మేడారం జాతర చరిత్ర, ప్రాశస్త్యం గురించి మంత్రి సీతక్కను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమ్మక్క-సారలమ్మల పోరాట గాథను ఖర్గే, రాహుల్ ఆసక్తిగా విన్నారు. సమ్మక్క ? సారలమ్మల చరిత్రను దేశవ్యాప్తంగా చాటేందుకు సినిమా తీయాలని రాహుల్ గాంధీ సూచించారు. పార్టీ సమావేశంలో మంత్రి సీతక్క, రాహుల్ గాంధీ మధ్య సరదా సంభాషణ జరిగింది. మేడారం జాతరకు ఆహ్వానిస్తే తాము తప్పకుండా హాజరయ్యేవారమని రాహుల్ గాంధీ అన్నారు. 'ఆహ్వానిస్తే తాను కూడా తల్లుల దర్శనానికి వచ్చే వాడిని' అని మల్లికార్జున్ ఖర్గే తెలిపారు. అయితే సమయాభావం వల్ల వ్యక్తిగతంగా ఆహ్వానించలేకపోయినట్లు మంత్రి సీతక్క వివరించారు. వచ్చే జాతరకు తప్పకుండా అధికారిక ఆహ్వానం అందిస్తామని సీతక్క అన్నారు. 'ఆహ్వానం అందితే తప్పకుండా వస్తాము' అని రాహుల్ గాంధీ, ఖర్గే హామీ ఇచ్చారు.

# కృత్రిమ మేధ ఆవిష్కరణలకు వేదికగా తెలంగాణ

### ఏఐ యూనివర్సిటీ, ఏఐ హబ్‌ల ఏర్పాటుకు బడ్జెట్ కేటాయింపులు

### ఇంపాక్ట్ సమ్మిట్ రౌండ్ టేబుల్ సమావేశంలో శ్రీధర్ బాబు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 :** కృత్రిమ మేధకు సంబంధించిన నూతన ఆవిష్కరణల వేదికగా నిలుస్తున్న తెలంగాణా రాష్ట్రం అమెరికా పెట్టుబడిదారులకు అనేక అవకాశాలను కల్పిస్తోందని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ప్రతిష్టాత్మక 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్-2026' లో భాగంగా దేశ రాజధానిలో అమెరికా-ఇండియా వాజిజ్య మండలి ప్రతినిధులతో జరిగిన రౌండ్ టేబుల్ సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేసారు.ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అత్యున్నత టెక్నాలిజి ఎకోసిస్టం రాష్ట్రంలో నూతన అవకాశాలను సృష్టించిందని శ్రీధర్ బాబు తెలిపారు. అమెరికా టెక్ దిగ్గజాలతో పబ్లిక్ ప్రేవేల్ భాగస్వామ్యాన్ని ఇప్పటికే తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చెప్పారు. ముందు చూపుతో కూడిన స్థిరమైన విధానాలు ఏఐ పరిశోధనలకు ఆలంబనగా మారాయని శ్రీధర్ బాబు వివరించారు. ప్రజా సేవలపై రియల్ టైం పర్యవేక్షణతో కృత్రిమ మేథ వినియోగాన్ని పెంచిన విషయాన్ని ఆయన వెల్లడించారు. ఆరోగ్యం, వ్యవసాయం, విద్య, పట్టణాభివృద్ధి వంటి రంగాలపై దృష్టి సారించిన ఇన్నోవేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణను ఏఐ రంగంలో అగ్రగామిగా నిలబెట్టింది. కృత్రమ మేధ ఆవిష్కరణలకు ప్రపంచంలోనే ఒక ముఖ్య కేంద్రంగా నిలబడేలా తెలంగాణాను తీర్చుదిద్దు తున్నామని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రధర్ బాబు వెల్లడించారు. వేగంగా దూసుకుపోతున్న టెక్నాలజి ప్రపంచంతో పోటీ పడాలన్నదే తమ సంకల్పం అని ఆయన అన్నారు. ఏఐ యూనివర్సిటీ, ఏఐ హబ్ ల ఏర్పాటు, ప్రతిభావంతులతో కూడిన స్కిల్ ఫోర్స్ ను అందుబాటులోకి తెచ్చేందుకు త్వరలో ప్రవేశ పెట్టనున్న రాష్ట్ర బడ్జెట్ లో అత్యంత ప్రాధాన్యతనిస్తాం అని వెల్లడించారు.

# దక్షిణ మండల విద్యుత్ సంస్థలో అవినీతి


- 8మంది ఇంజనీర్లను సస్పెండ్ చేస్తే ఉత్తర్వులు
- తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం




**హైదరాబాద్, ఫిబ్రవరి 19:** దక్షిణ మండల విద్యుత్ సంస్థలో అవినీతి ఆరోపణలపై తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో మొత్తం 8 మంది ఇంజినీర్లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. విజిలెన్స్ విచారణలో అవినీతి ఆరోపణలు నిజమని తేలడంతో ఈ చర్యలు తీసుకుంది. ఈ ఘటన విద్యుత్ శాఖలో తీవ్ర చర్చకు దారి తీసింది. ప్రజలకు సేవలందించే కీలక విభాగంలో అవినీతి చోటుచేసుకోవడం ఆందోళనకరంగా మారింది. విద్యుత్ శాఖలో అవినీతి జరుగుతోందన్న ఆరోపణలపై కొంతకాలంగా అనేక ఫిర్యాదులు అందాయి. మొత్తం 150కు పైగా ఫిర్యాదులు అందిన నేపథ్యంలో.. విజిలెన్స్ అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. ఈ విచారణలో భాగంగా అధికారులు పలు ఆధారాలను సేకరించారు. ఫిర్యాదుల్లో పేర్కొన్న అంశాలను పరిశీలించి సంబంధిత ఇంజినీర్ల పాత్రను గుర్తించారు. ఈ విచారణలో అవినీతి జరిగినట్లు స్పష్టమైన ఆధారాలు లభించాయి. విజిలెన్స్ విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇంజినీర్లు ఫోన్ పే, గూగుల్ పే వంటి డిజిటల్ చెల్లింపు మార్గాల ద్వారా లంచాలు తీసుకున్నట్లు అధికారులు గుర్తించారు. సాధారణంగా నగదు రూపంలో జరిగే లంచాల స్థానంలో డిజిటల్ చెల్లింపులను ఉపయోగించడం గమనార్హం. సేవలు అందించేందుకు, ఫైళ్లను త్వరగా పరిష్కరించేందుకు, కొత్త కనెక్షన్లు ఇచ్చేందుకు 8 మంది అధికారులు లంచాలు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. డిజిటల్ చెల్లింపుల ద్వారా జరిగిన లావాదేవీలను అధికారులు సాంకేతికంగా పరిశీలించి ఆధారాలు సేకరించారు. సస్పెండ్ అయిన వారిలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, సబ్ ఇంజినీర్లు ఉన్నారు. మొత్తం 8 మంది అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. వారిపై మరింత శాఖాపరమైన విచారణ కూడా చేపట్టే అవకాశం ఉంది. అవినీతి విషయంలో తెలంగాణ సర్కార్ కఠిన వైఖరి అవలంభిస్తోంది. ప్రజలకు సేవలందించే ప్రభుత్వ శాఖల్లో అవినీతి సహించమని ప్రభుత్వం స్పష్టం చేసింది. అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ కేసులో మరికొందరి పాత్ర కూడా ఉండే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో మరిన్ని చర్యలు తీసుకునే అవకాశం ఉంది. విద్యుత్ శాఖలో పారదర్శకత పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచాలు డిమాండ్ చేస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. అవినీతి నిర్మూలనకు ప్రజల సహకారం అవసరమని తెలిపారు.

# దేవ్‌జీ లక్ష్యంగా కూంబింగ్

- కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్
- ఐదురుగు మావోలు మృతి చెందినట్లు గుర్తింపు



**రాయపూర్, ఫిబ్రవరి 19:** ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాల కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతిచెందారు. మావోయిస్టు అగ్రనేత, ఆ పార్టీ కార్యదర్శి దేవ్ జీ లక్ష్యంగా కర్రెగుట్టల అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. కర్రెగుట్టల్లో తలదాచుకున్న మావోయిస్టులు.. ఈ విషయాన్ని గమనించి భద్రతా బలగాలపైకి కాల్పులు జరిపారు. వెంటనే భద్రతా బలగాలు సైతం ఎదురుకాల్పులకు దిగాయి. ఇరువైపులా నుంచీ హోరాహోరీగా కాల్పులు జరిగాయి. కొద్దిసేపటి తర్వాత మావోయిస్టుల వైపు నుంచి కాల్పులు ఆగిపోయాయి. ఆ ప్రాంతంలో ఐదుగురు మావోయిస్టుల మృతదేహాలను భద్రతా బలగాలు గుర్తించాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని భద్రతా బలగాలు వెల్లడించాయి. మృతుల్లో అగ్రనేతలు ఉండవచ్చని భద్రతా దళాలు భావిస్తున్నాయి. మధ్యప్రదేశ్ నుంచి కర్రెగుట్టల్లోకి మావోలు ప్రవేశించారంటూ నిఘా వర్గాలకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో నిఘా వర్గాల సమాచారం మేరకు భద్రతా బలగాలు.. ఈ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టాయి. మరోవైపు దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్ గడువు మరికొన్ని రోజుల్లో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఆ లక్ష్యం దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. ఇప్పటికే వందలాది మంది మావోయిస్టులు మృతిచెందగా.. వేలాది మంది వివిధ రాష్ట్రాల ప్రభుత్వాల ఎదుట లొంగిపోయారు. పలువురు మావోలను ప్రభుత్వం ఇప్పటికే అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం తెలంగాణకు చెందిన 15మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారు. ఆ జాబితాలో రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, మావోయిస్టు కీలక నేత ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, పుసునూరి నరహరి అలియాస్ సంతోష్, ముప్పిడి సాంబయ్య, వార్త శేఖర్, జోడే రత్నభాయి, బడే చొక్కారావుల కోసం భద్రతా బలగాలు జల్లెడ పడుతున్నాయి. ఇక ఈ రెండేళ్లలో 588 మంది మావోయిస్టులు తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

# బడ్జెట్‌లో నిధులు ఇవ్వాల్సిందే!

- రెండేళ్లుగా తెలంగాణ ప్రజలను నిట్టనిలువునా మోసం చేశారు
- మహిళల 2500, రైతుబంధు 15 వేలు, పెన్షన్ల పెంపు ఏమైంది?
- హామీల అమలుపై 'హస్తం' సర్కార్‌కు కేటీఆర్ అల్టిమేటం
- సీఎం రేవంత్‌కు ఘాటైన లేఖ




**హైదరాబాద్, ఫిబ్రవరి 19:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సగం కాలం పూర్తవుతున్నా, ఆరు గ్యారెంటీలతో సహా ఎన్నికల వేళ ఇచ్చిన 420 హామీల్లో 5 శాతం కూడా అమలు చేయలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. త్వరలో ప్రవేశపెట్టనున్న 2026-27 బడ్జెట్‌లోనైనా ఈ హామీల అమలుకు అవసరమైన పూర్తి నిధులను కేటాయించి, ప్రభుత్వం తన నిజాయితీని చాటుకోవాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన గురువారం ఒక బహిరంగ లేఖ రాశారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు ప్రజలకు 'బాకీ కార్డులు' మిగిల్చిందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. "నాడు పీసీసీ అధ్యక్షుడిగా తొలి కేబినెట్‌లోనే ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామన్న హామీ ఏమైంది? గడిచిన 25 నెలల్లో ఒక్క మహిళకైనా మహాలక్ష్మి పథకం కింద 2500 రూపాయలు అందాయా?" అని ప్రశ్నించారు. పెన్షన్లను 4 వేలకు పెంచుతామన్న హామీ, కల్యాణ లక్ష్మి కింద తులం బంగారం వంటి వాగ్దానాలను అమలు చేయకపోవడం ఆడబిడ్డలను వంచించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణను దేశానికే ధాన్యాగారంగా మార్చిన కేసీఆర్ హయాంలోని రైతుబంధును 15 వేలకు పెంచుతామని చెప్పి, ఇప్పుడు పాత బకాయిలు కూడా చెల్లించకుండా అన్నదాతలకు కాంగ్రెస్ వెన్నుపోటు పొడిచిందని కేటీఆర్ మండిపడ్డారు. రైతులు, కౌలు రైతులు, రైతు కూలీల ఖాతాల్లో వెంటనే నిధులు జమ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రెండేళ్లలో 2 లక్షల ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి వంటి హామీలు గంగలో కలిశాయని, జాబ్ క్యాలెండర్ పేరుతో యువత గొంతు కోశారని విమర్శించారు. ప్రజాపాలన పేరిట అటెన్షన్ డైవర్ట్ చేసే కుట్రలను తెలంగాణ సమాజం గమనిస్తోందని కేటీఆర్ హెచ్చరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. "ఈ బడ్జెట్‌లోనైనా ఇచ్చిన ప్రతి హామీకి లెక్కగట్టి నిధులు కేటాయించాలి. లేనిపక్షంలో తెలంగాణ సమాజం ఓపిక పట్టే ప్రసక్తే లేదు. ప్రభుత్వంపై ప్రజల తరపున ఒత్తిడి పెంచి, మోసకారి కాంగ్రెస్‌ను అసెంబ్లీ లోపల, బయటా నిలదీస్తాం" అని కేటీఆర్ తన లేఖలో ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# పోలీసులూ తస్మాత్ జాగ్రత్త

## వచ్చేది మా ప్రభుత్వమే!

- బలం లేని చోట కాంగ్రెస్ ఎలా గెలుస్తుంది? రేవంత్ సమాధానమివ్వాలి
- ఆదిలాబాద్ జైలులో బాల్క సుమన్‌కు పరామర్శ..
- సర్కార్ అరాచకాలపై నిప్పులు



**ఆదిలాబాద్, ఫిబ్రవరి 19:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, ప్రజాతీర్పును కాలరాస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదిలాబాద్ జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను గురువారం పరామర్శించిన ఆయన, అనంతరం జైలు వెలుపల మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై, పోలీసు అధికారులపై నిప్పులు చెరిగారు. క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ (14/22) ఉన్నప్పటికీ, మంత్రి వివేక్ వెంకటస్వామి అండతో కాంగ్రెస్ అరాచకాలకు పాల్పడిందని ఆరోపించారు. చైర్మన్ ఎన్నిక జరగకుండా పోలీసులే బందోబస్తు లేకుండా చేశారని, దళిత, గిరిజన మహిళా కౌన్సిలర్లపై దాడులు జరుగుతుంటే అధికారులు ప్రేక్షక పాత్ర వహించారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులపైనే దాడులు చేసి, రివర్స్‌లో బాల్క సుమన్‌పై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### పోలీసులకు సీరియస్ వార్నింగ్

కొందరు పోలీసు అధికారులు పోస్టింగ్‌ల కోసం కాంగ్రెస్ నేతలకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని హరీష్ రావు విమర్శించారు. "వినాశకాలే విపరీత బుద్ధి.. పోలీసులూ తస్మాత్ జాగ్రత్త! రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే, అప్పుడు ప్రతి ఒక్కరి లెక్కా తేలుస్తాం, ఎవరినీ వదిలిపెట్టం" అని ఆయన హెచ్చరించారు. జనగామ, ఇబ్రహీంపట్నం, ఆమనగల్‌లో కూడా బలవంతంగా ఓటింగ్ అడ్డుకున్నారని, రాహుల్ గాంధీ చెప్పే రాజ్యాంగం ఇదేనా? అని నిలదీశారు.

### గవర్నర్ జోక్యం చేసుకోవాలి

రాష్ట్రంలో జరుగుతున్న ఈ అరాచక పర్వంపై గవర్నర్ స్పందించి, క్యాతన్‌పల్లి ఘటనపై నివేదిక తెప్పించుకోవాలని హరీష్ రావు కోరారు. బాల్క సుమన్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని, అధికార అహంకారంతో వ్యవహరిస్తున్న వారికి కాలమే సమాధానం చెబుతుందని పేర్కొన్నారు. ఈ పరామర్శలో హరీష్ రావుతో పాటు ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, మాజీ మంత్రి జోగు రామన్న తదితరులు పాల్గొన్నారు.

# జోగిపేట బస్టాండ్‌లో భారీ చోరీ

- బస్సు ఎక్కుతున్న మహిళ బ్యాగులో బంగారం చోరీ
- ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు



**సంగారెడ్డి, ఫిబ్రవరి 19:** సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో పట్టపగలే భారీ చోరీ జరిగింది. ఓ శుభకార్యానికి వెళ్తున్న వృద్ధురాలిని లక్ష్యంగా చేసుకున్న దుండగులు.. ఆమె బ్యాగులోని 16 తులాల బంగారాన్ని అత్యంత చాకచక్యంగా అపహరించారు. అల్లాదుర్గానికి చెందిన చెగురి లక్ష్మి అనే వృద్ధురాలు.. హైదరాబాద్‌లోని తన మేనకోడలి కుమారుడి వివాహానికి హాజరయ్యేందుకు బయలుదేరింది. క్రమంలో అల్లాదుర్గం నుంచి జోగిపేట బస్టాండ్‌కు చేరుకున్న ఆమె.. అక్కడ దిగి, తన బంధువుతో కలిసి హైదరాబాద్ వెళ్లే మరో బస్సు ఎక్కేందుకు సిద్ధమైంది. అయితే బస్సు ఎక్కుతున్న సమయంలో ప్రయాణికుల రద్దీని అదునుగా చేసుకున్న గుర్తు తెలియని దుండగుడు.. ఆమె వద్ద ఉన్న బ్యాగు నుంచి 16 తులాల బంగారు ఆభరణాలను దొంగిలించి పరారయ్యాడు. ఈ భారీ చోరీ ఘటన స్థానికంగా కలకలం రేపింది. చోరీకి పాల్పడిన వ్యక్తిని గుర్తించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. బంగారం పోయిందని గుర్తించిన బాధితురాలు.. కన్నీరుమున్నీరుగా విలపిస్తూ జోగిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బస్టాండ్ ఆవరణ, పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారు. అనుమానిత వ్యక్తుల కదలికల ఆధారంగా నిందితుడిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. బస్టాండ్‌లు, రద్దీ ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ముఖ్యంగా విలువైన వస్తువులు తీసుకెళ్తున్నప్పుడు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. నిందితుడిని త్వరగా గుర్తించి బంగారాన్ని స్వాధీనం చేసుకుంటామని పోలీసులు తెలిపారు.

# ఏప్రిల్ నుంచి పలు రాష్ట్రాల్లో ఎన్నికల సవరణ

### సర్ ప్రక్రియపై ఆయా రాష్ట్రాలకు ఈసీ ఆదేశం




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఏప్రిల్ నుంచి దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాను పక్కాగా రూపొందించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సన్నద్ధమవుతోంది. ఈ మేరకు పలు రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులకు అత్యవసరంగా లేఖలు రాసింది. ఏప్రిల్ నుంచి ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ ప్రక్రియ ద్వారా ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదును అత్యంత పారదర్శకంగా నిర్వహించనున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం మొత్తం 20కి పైగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఈ ఆదేశాలు జారీ చేసింది. వాటిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఢిల్లీ, పంజాబ్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూ / కాశ్మీర్, లడఖ్, కర్ణాటక, ఒడిశా, జార్ఖండ్, సిక్కిం, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, త్రిపుర, మహారాష్ట్ర, దాద్రా నగర్ హవేలీ, డామన్ దయ్యూ ఉన్నాయి. సర్ కార్యక్రమానికి సంబంధించి సన్నాహక పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఆయా రాష్ట్రాల అధికారులు చర్యలు చేపట్టాలని సూచించింది. 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల్లో అధికారులు వీలైనంత త్వరగా సన్నాహకాలను పూర్తి చేసి, ఏప్రిల్ 2026 నుంచి ప్రారంభమయ్యే ఎస్ఐఆర్‌ని సజావుగా జరిగేలా చూడాలని కేంద్ర ఎన్నికల సంఘం దిశానిర్దేశం చేసింది.



# మేలో పార్టీని ప్రకటిస్తా

### ప్రధాన ప్రతిపక్షంగా ఎదుగుతాం ● అధికారంలోకి రావడం ఖాయం

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

**హైదరాబాద్, ఫిబ్రవరి 19:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన కొత్త రాజకీయ పార్టీ ప్రకటనకు ముహూర్తం ఖరారు చేశారు. మే నెల మొదటి వారంలో మంచి రోజు చూసుకుని పార్టీని అధికారికంగా ప్రకటిస్తామని ఆమె వెల్లడించారు. పార్టీ పేరులో 'తెలంగాణ' అనే పదం తప్పనిసరిగా ఉంటుందని కవిత స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఎక్కడి నుంచైనా పోటీ చేయవచ్చని అన్నారు. వచ్చే ఎన్నికల్లో తన మొదటి ఛాయిస్ సిద్దిపేట అని, రెండో ఛాయిస్ బోధన్ అని పేర్కొన్నారు. భవిష్యత్తులో తెలంగాణలో బీజేపీ ఉండదని, ప్రధాన ప్రతిపక్షంగా తామే అవుతామని కవిత ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి తామే వస్తామని, ప్రజల సమస్యలపై పోరాటం చేస్తామని చెప్పారు. ఎంపీటీసీ, జడ్పీటీసీలతో పాటు జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా పోటీ చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ దారిలోనే వెళ్తోందని, కొత్త తరహా రాజకీయం చేయడం లేదని విమర్శించారు. తన పార్టీ వ్యక్తుల మీద కాకుండా వ్యవస్థల మీద నడవాలన్నారు. ప్రాంతీయ పార్టీలు లీడర్ సెంట్రిక్‌గా ఉంటాయని.. కానీ వ్యవస్థ నిర్మాణం జరగాలని, సైద్ధాంతిక పునాది ఉండాలని అన్నారు. మహిళలను అవమానించవద్దన్నారు కవిత. వైఎస్ షర్మిలా రెడ్డి నేడు ఏపీలో ఒక జాతీయ పార్టీకి అధ్యక్షురాలిగా ఉన్నారని.. కానీ, షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టడం ప్రజలకు నచ్చలేదని తెలిపారు. చిరంజీవి పార్టీ పెట్టి మూసివేయలేదా అని ప్రశ్నించారు. 'నా లైన్‌లో నేను వెళ్తున్నా.. నా ప్రయత్నం నాది' అని అన్నారు. తెలంగాణ వాదమే తమ పార్టీ మొదటి లైన్ అని తేల్చిచెప్పారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు కింది స్థాయి నుంచి వచ్చినవారు కేంద్ర మంత్రులు అయ్యారని చెప్పుకొచ్చారు. కొత్త తరానికి తాను పెట్టబోయే పార్టీలో అవకాశాలు ఉంటాయని కవిత పేర్కొన్నారు.

# మంత్రుల అవినీతి చిట్టా బయటపెడతాం: బండి



**హైదరాబాద్, ఫిబ్రవరి 19:** మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీల చెంపచెల్లుమనిపించామని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. బీఆర్ఎస్ బరితెగించి కాంగ్రెస్‌తో కుమ్మక్కైందని విమర్శించారు. భాజపాను అడ్డుకునేందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ కుమ్మక్కయ్యాయి. మజ్లిస్ కోసమే భాగ్యనగరాన్ని సీఎం రేవంత్‌రెడ్డి మూడు ముక్కలు చేశారు. రూ.2.18 లక్షల కోట్ల పెట్టుబడులు ఎక్కడికి పోయాయి. దిల్లీకి మూటలు పంపేందుకే తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఒక్కో మంత్రి అవినీతి చిట్టా బయటపెడతాం. అవినీతికి సంబంధించిన ఆడియో రికార్డులు మా వద్ద ఉన్నాయి. 2029లో ఏ రాష్ట్రంలోనూ కాంగ్రెస్ అధికారంలో ఉండదని బండి సంజయ్ అన్నారు.




# తెలంగాణ ఇంటర్ హాల్ టికెట్లు విడుదల

### ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 19:** తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యార్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న హాల్ టికెట్ల ప్రక్రియ పూర్తయింది. మార్చిలో జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థుల హాల్ టికెట్లను బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ తాజాగా విడుదల చేసింది. ఈ ఏడాది దాదాపు 9.9 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండటంతో, బోర్డు అన్ని ఏర్పాట్లను ముమ్మరం చేసింది. షెడ్యూల్ ప్రకారం, ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. హాల్ టికెట్లు ఇప్పటికే ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చాయి. అయితే, విద్యార్థులు నేరుగా డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయంతో పాటు, వారి సంబంధిత కళాశాల ప్రిన్సిపాళ్ల నుండి ధ్రువీకరించిన హాల్ టికెట్లను తీసుకోవాలని బోర్డు సూచించింది. విద్యార్థుల సౌకర్యార్థం వారి రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకునే లింక్‌ను కూడా పంపుతున్నారు. ఈసారి సాంకేతికతను జోడిస్తూ బోర్డు కీలక మార్పులు చేసింది. విద్యార్థులు తమ పరీక్షా కేంద్రాలను సులభంగా , ఖచ్చితంగా గుర్తించడానికి వీలుగా హాల్ టికెట్లపై కోడ్ ను ముద్రించారు. దీనిని స్కాన్ చేయడం ద్వారా సెంటర్ లొకేషన్ వివరాలను సులభంగా తెలుసుకోవచ్చు. ఒకవేళ హాల్ టికెట్‌లో పేరు, ఫోటో, సంతకం లేదా సబ్జెక్టులకు సంబంధించి ఏవైనా తప్పులు ఉంటే, వెంటనే కళాశాల ప్రిన్సిపాల్ ద్వారా బోర్డు దృష్టికి తీసుకెళ్లాలని అధికారులు హెచ్చరించారు. పరీక్షల సమయం దగ్గర పడుతుండటంతో విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. హాల్ టికెట్లు అందిన వెంటనే అన్ని వివరాలు సరిచూసుకోవడం, పరీక్షా కేంద్రాన్ని ఒక రోజు ముందే సందర్శించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని బోర్డు అధికారులు తెలిపారు. ఈ నెలాఖరు నుంచే ప్రారంభం కానున్న ఈ వార్షిక పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా వందలాది కేంద్రాలను సిద్ధం చేశారు.



సంపాదకీయం

# దూసుకొస్తున్న ఏఐ.. అప్రమత్తతే ముఖ్యం!

ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ (ఏఐ)విప్లవం శరవేగంగా విస్తరిస్తోంది. భారత్‌ను గ్లోబల్ సౌత్‌కు సాంకేతిక కేంద్రంగా నిలబెట్టాలన్న లక్ష్యంతో దేశ రాజధానిలో నిర్వహిస్తున్న 'ఇండియా-ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026' ఈ సాంకేతికతపై ఉన్న ఆశలను, ఆందోళనలను మరోసారి తెరపైకి తెచ్చింది. ఏఐ వినియోగంలో భారత్ దూసుకుపోతున్నా, దానివల్ల తలెత్తే దుష్ఫలితాలపై అప్రమత్తంగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఎఐ దుష్ఫలితాలను చర్చించడం ద్వారా యువత భవిష్యత్ గురించి ఇప్పుడు ప్రపంచం ఆలోచించాలి. ఎఐతో పెనుముప్పు తప్పదని ప్రఖ్యాత కంపెనీలు, నిపుణులు హెచ్చరిస్తున్న వేళ దీనిపై ప్రధానంగా చర్చించాలి. ఎందుకంటే నిరుద్యోగాన్ఇన ఇది పెంచి పోషించడం ఖాయమని అంటున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న 'ఇండియా–ఎ.ఐ ఇంపాక్ట్ సమ్మిట్–2026' సందర్భంగా ప్రధానంగా దుష్ఫలితాలను చర్చించాలి. ఉద్యోగావకాశాలు పోతాయని అంటున్నప్పుడు దాని ప్రభావంతో జరిగే నష్టాన్ని చర్చించి, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. ప్రాథమిక స్థాయి వ్యవస్థను పూర్తి స్థాయిలో స్వదేశీ పునాదిమీద ఏర్పాటు చేసుకోవడం భవిష్యత్తులో అన్ని విధాల మేలు చేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. అయితే, ఎలాంటి ముప్పు ఏర్పడబోతుందో అన్నది ప్రధానంగా ఎఐ సమ్మిట్‌లో చర్చిస్తే మంచిది. కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం ఆ దిశలో నిపుణులతో కమిటీ వేసి చర్చించి, ఉపద్రవానికి ముందే చర్యలకు పూనుకోవాలి. ఢిల్లీ వేదికగా అట్టహాసంగా నిర్వహిస్తున్న ఎఐ సదస్సులో ఈ మేరకు ప్రకటన రావాల్సి ఉంది.

భారత్‌ను గ్లోబల్ సౌత్‌కు సాంకేతిక కేంద్రంగా నిలబెట్టాలన్న లక్ష్యంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే, ఆ దిశలో తీసుకుంటున్న చర్యలేంటన్నది చర్చకు రావాలి. అంతర్జాతీయ స్థాయిలో నాయకత్వం వహించే సంగతి అలా ఉంచితే ప్రపంచ స్థాయికి సరితూగే లేదా దగ్గరగా ఉన్న పునాది స్థాయి వ్యవస్థ కూడా మన దగ్గర లేదు. ఈ రంగంలో ఇప్పటికే నాయకత్వం వహిస్తూ ప్రపంచానికి దిశా నిర్దేశర చేస్తున్న అమెరికా, చైనాలు పెద్ద ఎత్తున నైపుణ్యాలను, పరిశోధనలను విస్తృతం చేస్తుండగా, మనం ఏం చేయాలి, ఎలా చేయాలి అన్న దాని దగ్గరే ఉన్నాం. అనేకమంది మేధావులు మనచెంత ఉన్నారు. ఎఐ కి సంబంధించిన అనేక విషయాలను అంతర్జాతీయంగా గుర్తించిన నిపుణులు మనవాళ్లలో ఉన్నారు. ఫౌండేషన్ మోడల్ సంగతి అలా ఉంచితే, లార్జి మోడల్స్ ట్రైనింగ్‌కు అవసరమైన హైపర్ స్కేల్ డేటా సెంటర్లు కూడా అందుబాటులో లేవు. ఇవేవీ లేకుండా గ్లోబల్ లీడర్‌షిప్ గురించి, అప్పుడు వెల్లువెత్తే అవకాశాల గురించి మాట్లాడటం ఆకాశానికి నిచ్చెనలు వేయడమే అవుతుంది. సవాళ్లను గుర్తించి, అందుకు సమాధానాలను వెతుక్కునే సమయమిది. ఇంపాక్ట్ సమ్మిట్ కోసం నీతి ఆయోగ్ రూపొందించిన నివేదిక ప్రకారం ఎఐ రంగంలో మన దేశం పూర్తిస్థాయిలో సన్నద్ధం కావడానికి మరో పది నుండి ఇరవై ఏళ్లు పడుతుందని అంటున్నారు. 2047 నాటికి ఎఐ రంగంలో భారత్‌ను సూపర్ పవర్‌గా నిలపనున్నట్లు ప్రధాని నరేంద్రమోడీ చెప్పారు. 'కేవలం ఎఐ వినియోగదారునిగా కాకుండా ఎఐ సృష్టికర్తగా, ఎఐ విప్లవంలో భాగస్వామి దశ నుండి దానిని శాసించే స్థాయికి ఎదిగేలా తీర్చిదిద్దుతున్నాం' అని మోడీ అన్నారు. ఎఐ సదస్సులో ఇదే విషయం చెప్పారు. కొత్త సాంకేతికతను భారత్ ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటోంది. ప్రతిభావంతులకు స్వర్గధామంగా భారత్ ఉంది. ఏఐ కేంద్రంగా ఇండియా మారుతోంది. ఏఐ అనేది ఓ పరివర్తన శక్తి. దాన్ని దుర్వినియోగం చేస్తే విధ్వంసానికి దారితీస్తుంది. ఏఐ అనేది యువత, భారత్‌కు కొత్త విశ్వాసం, ఆస్తిగా ఉంది. తొలినాళ్లలో ఏఐపై అనేక సందేహాలు వచ్చాయి. కానీ ఇప్పుడు ఏఐని యువత ప్రయోజనకరంగా ఉపయోగిస్తోంది. వివిధ రంగాల సమస్యలకు ఏఐ పరిష్కారం చూపుతోందని మోదీ తెలిపారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో శరవేగంగా మార్పులు చోటుచేసుకుంటున్న ప్రస్తుత తరుణంలో అప్పటికి పరిస్థితులు ఎలా ఉంటాయో, ఏ కొత్త సాంకేతికత ఉనికిలోకి వస్తుందో తెలియదు! మరోవైపు ప్రపంచంలో ఎఐ అభివృద్ధి విస్ఫోటనం చెందుతోంది. శక్తివంతమైన నమూనాలకు శిక్షణ ఇచ్చే కంప్యూటింగ్ శరవేగంగా పెరుగుతోంది. ప్రత్యేకమైన చిప్‌ల తయారీ కోసం పెద్దఎత్తున పోటీ జరుగుతోంది, భారీ టెక్ సంస్థలు ఎఐలోకి పెద్ద మొత్తాలను కుమ్మరిస్తున్నాయి. 2024 నుండి అమెరికా, చైనాలు ఈ రంగంపై దృష్టి సారించి భారీ మొత్తంలో ఖర్చు చేస్తున్నాయి. మన దేశంలో ఈ రంగ అభివృద్ధి కోసం ఇప్పుడిప్పుడే పరిశోధనలు మొదలయ్యాయి. మరోవైపు ఎఐ వద్ధి పేరుతో వ్యక్తిగత గోప్యతకు ముప్పు తలెత్తే ప్రమాదం ఉంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ప్రభావం పడనుంది. న్యాయవ్యవస్థలో కూడా ఎఐ వినియోగంపై జాగ్రత్త అవసరమని ఇటీవల సుప్రీంకోర్టు సూచించింది. ఆరోగ్య రంగంలోనూ ఇటువంటి ఆందోళనలే వ్యక్తమవుతున్నాయి. మీడియా, రాజకీయ రంగాల్లో డీప్‌ఫేక్‌ల భయాలు ఇప్పటికే ప్రారంభమైనాయి. పెద్ద టెక్ సంస్థల ఆధిపత్యం పెరిగితే డేటా, మౌలిక వసతులు వారి చేతుల్లోనే కేంద్రీకృతమయ్యే ప్రమాదం ఉంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని బలమైన పారదర్శక చట్టాలు, డేటా రక్షణ, నైతిక నియంత్రణ, సమగ్ర శిక్షణ విధానాలను రూపొందించాల్సి ఉంది. దేశంలో ఉన్న యువశక్తిని సమర్థవంతంగా వినియోగిం చకోవడంతో పాటు, డేటా సెంటర్లు, ఫౌండేషన్ మోడల్స్, చిప్ తయారీ వంటి అంశాలపై దృష్టి సారించాలి. ఢిల్లీ ఎఐ సదస్సులో చోటుచేసుకున్న సాంకేతిక లోపాలతో పాటు, మేడ్ ఇన్ చైనా రోబోడాగ్‌ను తమ సొంత ఆవిష్కరణగా ప్రకటించుకుని నగుబాటైన గల్గోటియాస్ యూనివర్సిటీ నిర్వాకం అంతర్జాతీయ వేదికపై దేశ ప్రతిష్టను మసకబార్చాయి. భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా చూడాలి. అన్నింటికి మించి నిరుద్యోగానికి సవాల్‌గా మారిన ఐఎని ఎలా అధిగమించాలన్న దానిపై ప్రయత్నాలు జరగాలి.

# ఏఐ మనల్ని శాసించొద్దు..

## మనమే ఏఐని శాసించాలి

- ఏఐ అంటే కేవలం టెక్నాలజీ కాదు.. అదొక పరివర్తన శక్తి!
- విధ్వంసానికి తావులేకుండా 'మానవ్ విజన్'తో ముందుకు సాగాలి
- 'ఇండియా ఏఐ సమ్మిట్'లో ప్రధాని మోడీ పిలుపు





**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సామర్థ్యం మన ఊహలకు అందనంత వేగంగా దూసుకుపోతోందని, అయితే ఈ సాంకేతికత మనిషిని శాసించే స్థాయికి చేరకూడదని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. దేశ రాజధానిలో జరుగుతున్న ప్రతిష్టాత్మక 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు'లో గురువారం ఆయన ప్రసంగిస్తూ.. ఏఐ వినియోగంపై ప్రపంచానికి దిశానిర్దేశం చేశారు. ప్రపంచ జనాభాలో ఆరో వంతు ఉన్న భారత్.. కొత్త సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో అగ్రభాగాన నిలుస్తోందని ప్రధాని కొనియాడారు. దేశ యువత ఏఐ పట్ల చూపుతున్న ఆసక్తిని ప్రస్తావిస్తూ.. భారత్‌లో జరుగుతున్న ఏఐ విప్లవం భవిష్యత్తులో ఒక గొప్ప చరిత్రగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 'మేక్ ఇన్ ఇండియా' స్ఫూర్తితో భారత ఆవిష్కరణ సామర్థ్యాన్ని ఈ సదస్సు ప్రపంచానికి చాటుతోందని ఆయన పేర్కొన్నారు. ఏఐకి ఉన్న పరివర్తన శక్తి గురించి హెచ్చరిస్తూ.. దీనిని సద్వినియోగం చేసుకుంటే ఎన్నో సంక్లిష్ట సమస్యలకు పరిష్కారాలు దొరుకుతాయని, అదే తప్పుడు చేతుల్లోకి వెళ్తే విధ్వంసానికి దారితీస్తుందని ప్రధాని ఆందోళన వ్యక్తం చేశారు. "ఏఐ భవిష్యత్తులో ఏం చేయగలదన్నది కాదు.. ఏఐని ఉపయోగించి ప్రస్తుతం మనం ఏం చేయగలమన్నదే అసలు ప్రశ్న" అని మోడీ వ్యాఖ్యానించారు. ప్రజా సంక్షేమమే ఏఐకి బెంచ్‌మార్క్ కావాలని, మానవ కేంద్రిత ఏఐ నిర్మాణం మన లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. ఏఐ వినియోగంలో 'మానవ్ విజన్' అత్యంత కీలకమని ప్రధాని కొత్త నినాదాన్ని వినిపించారు. ఇది కేవలం సాంకేతికత మాత్రమే కాదని, ఒక పటిష్టమైన ఫ్రేమ్‌వర్క్ అని ఆయన వివరించారు. ఏఐ వినియోగం చట్టబద్ధంగా ఉండటమే కాకుండా, ఎప్పటికప్పుడు పునఃసమీక్షించేలా పారదర్శకంగా ఉండాలని సూచించారు. మనుషులు, సాంకేతికత కలిసి ప్రయాణించే కొత్త శకంలో మనం ఉన్నామని, ఈ విప్లవంలో భారత్ తనదైన ముద్ర వేస్తుందని ప్రధాని మోడీ స్పష్టం చేశారు.

# ఉచిత పథకాలపై మరోమారు సుప్రీం సీరియస్

- ప్రజల సొమ్మును దుబారా చేయడంపై ఆగ్రహం
- పేదలకు విద్య తదితర కనీస అవసరాలు కల్పించాల్సిందే
- చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** దేశంలో రాజకీయ పార్టీలు అందిస్తున్న ఉచిత పథకాలపై సుప్రీంకోర్టు మరోసారి తీవ్రస్థాయిలో స్పందించింది. తమిళనాడు విద్యుత్ పంపిణీ సంస్థకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశ మయ్యాయి. ఉచిత పథకాల వల్ల దేశ ఆర్థికాభివృద్ధి కుంటుపడుతుందని కోర్టు హెచ్చరించింది. తమిళనాడులో ఉచిత విద్యుత్ సరఫరా, ఆర్థిక స్థితిగతులపై విచారణ చేపట్టిన కోర్టు, విద్యుత్ పంపిణీ సంస్థకు నిధులు ఎక్కడి నుండి వస్తున్నాయో వివరించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. దీనిపై పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని కోరింది. పేదలకు విద్య, కనీస అవసరాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని కోర్టు అంగీకరించింది. అయితే, పెద్ద పెద్ద భూస్వాములకు కూడా ఉచిత విద్యుత్ అందించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. 'సౌకర్యం కావాలనుకున్నప్పుడు డబ్బులు చెల్లించాలి కదా! పెద్ద భూస్వాములు ఉచితం అని అనవసరంగా లైట్లు, మెషీన్లు వాడుతున్నారు' అని జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ఎన్నికలకు ముందే ఉచిత పథకాలను ప్రకటించే సంస్కృతిపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజకీయ పార్టీలు, సామాజికవేత్తలు తమ సిద్ధాంతాలను పునరాలోచించుకోవాల్సిన అవసరం ఉందని హితవు పలికింది. ప్రభుత్వం ఇచ్చే ఉచితాల వెనుక ఉన్నది ప్రజల కష్టార్జితమైన పన్నుల సొమ్ము అని కోర్టు గుర్తు చేసింది. రాష్ట్రాలు అప్పుల్లో ఉన్నప్పటికీ ఉచిత పథకాలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించింది. రాష్ట్రాలు వసూలు చేసే ఆదాయంలో కనీసం 25 శాతాన్ని రాష్ట్ర అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు ఎందుకు ఉపయోగించకూడదని ధర్మాసనం సూటిగా ప్రశ్నించింది. అంతేకాదు, 'ఉచితాలు ఎన్నాళ్లు కొనసాగుతాయి?' అన్న సుప్రీంకోర్టు ప్రశ్న ఇప్పుడు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సవాలుగా మారింది. సంక్షేమం పేరుతో ఆర్థిక క్రమశిక్షణను విస్మరిస్తే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు తప్పవని అత్యున్నత న్యాయస్థానం పరోక్షంగా హెచ్చరించింది.

# ప్రధాని అవుతావు

## ప్రియాంక గాంధీకి బాబా దీవెనలు



**గౌహతి, ఫిబ్రవరి 19:** కాంగ్రెస్ ఎంపీ, స్క్రీనింగ్ కమిటీ చైర్‌పర్సన్ ప్రి యాంక గాంధీ గురువారం అస్సాంలో పర్యటించగా, అక్కడ ఆసక్తికర సన్నివేశంచోటు చేసుకుంది. కామాఖ్య ఆలయానికి వెళ్ళినప్పుడు ఆమెకు బాబా (సన్యాసి) ఆశీర్వాదం లభించడం అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రియాంక గురువారం ఉదయం 10 గంటల ప్రాంతంలో గౌహతిలోని లోక్‌ప్రియ గోపీనాథ్ బోర్డోలోయ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుని, అక్కడినుంచి నేరుగా ప్రార్థనలు నగరంలోని కామాఖ్య ఆలయానికి వెళ్లారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అస్సాం నాగరికత, సంస్కృతిని గౌరవిస్తూ, లక్షలాది మంది ప్రజల విశ్వాసంతో ముడిపడి వున్న కామాఖ్య దేవిఅమ్మవారి ఆశీర్వాదం పొందడానికి వచ్చాననీ ప్రియాంకతెలిపారు. ఆలయంలో ప్రార్థనలు చేసిన తర్వాత సంతోషంగా అనిపించిందన్నారు. ఆలయ సందర్శన సమయంలో నాగ సాధువుతో క్లుప్తంగా సంభాషించారు. ఈ సందర్భంగా ప్రియాంక గాంధీ తలపై చేయి వేసి "హమారా బేటీ ప్రధాన మంత్రి బనేగా (మా కూతురు ప్రధాన మంత్రి అవుతుంది)" అంటూ దీవించారు. దీంతో ఆమె చిరునవ్వుతో అక్కడ నుంచి వెళ్లిపోయారు. దీనికి సంబంధించిన వీడియో తెగ వైరల్‌అవుతోంది. అనంతరం ప్రియాంక గాంధీ ఎంపీ గౌహతిలోని రాజీవ్ భవన్ (కాంగ్రెస్ భవన్)కు బయలుదేరి వెళ్లారు.

# నైజీరియా గనిలో విషయవాయువుల లీక్

## 37మందిని బలి తీసుకున్న ఘటన

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** నైజీరియాలోని ఓ గనిలో విషవాయువులు లీకయ్యాయి. ఆ విష వాయువులను పీల్చి 37 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 26 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుందని అక్కడి పోలీస్ అధికారులు వెల్లడించారు. నార్త్ సెంట్రల్ నైజీరియాలోని ఓ గనిలో ఆకస్మికంగా లెడ్ ఆక్సైడ్, సల్ఫర్, కార్బన్ మోనాక్సైడ్ గ్యాస్‌లు లీక్ అయ్యాయి. ఈ వాయువులు మానవాళికి విషపూరితమైనవి. పైగా గనిలో వెంటిలేషన్ కూడా తక్కువగా ఉండడంతో వీటి ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఈ విష వాయువులను పీల్చి 37 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 26 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిని అధికారులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నైజీరియా సర్కారు ఈ ప్రమాద ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించింది. గనిలో విష వాయువులు లీకవుతాయనే విషయంలో అవగాహన లేకపోవడంతోనే ప్రాణనష్టం ఎక్కువగా జరిగిందని అక్కడి మంత్రి చెప్పారు. ప్రమాదానికి కారణమైన గని సక్రమమైనదా, అక్రమమైనదా అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నట్టు మంత్రి పేర్కొన్నారు.

# డిజిటల్ రంగంలో భారత్ విప్లవాత్మక మార్పులు

## అధికవడ్డీ రుణాలపై వడ్డీ తగ్గింపు.. కొత్త ఆవిష్కరణలు ఆర్థిక వ్యవస్థ వృద్ధికి తోడ్పాటు

### ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో టెక్ దిగ్గజాల వెల్లడి




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** డిజిటల్ రంగంలో భారత్ విప్లవాత్మక మార్పులు సాధిస్తోందని, ఏఐ కేంద్రంగా మారుతోందని పలుదేశాల ప్రతినిధులు ప్రశంసించారు. ప్రపంచంలోనే అతిపెద్ద కృత్రిమ మేధ సదస్సుకు భారత్ వేదికైంది. దిల్లీలోని భారత మండపంలో జరుగుతోన్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్'లో 118 దేశాలు పాల్గొన్నాయి. గురువారం జరిగిన సదస్సు అధికారిక ప్రారంభ కార్యక్రమంలో పలువురు దేశాధినేతలు, టెక్ దిగ్గజాలు పాల్గొని కీలక ప్రసంగం చేశారు. కొత్త ఆవిష్కరణలు ఆర్థిక వ్యవస్థను వృద్ధి పథంలో నడిపిస్తాయి. ఏఐ నిర్మాణం అందరికీ చాలా ఉపయోగంగా ఉంటుంది. భారత్‌ను సందర్శించిన ప్రతిసారీ మార్పుల వేగం చూసి ఆశ్చర్యపోతున్నా. విద్యార్థిగా ఉన్నప్పుడు ఐఐటీ ఖరగ్‌పూర్‌కు విశాఖ మీదుగా వెళ్లేవాడిని. అదే విశాఖ తీరంలో ఇప్పుడు గూగుల్ ఫుల్ స్టాక్ ఏఐ హబ్ ఏర్పాటవుతోంది' అని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ తెలిపారు. డిజిటల్ రంగంలో భారత్ విప్లవాత్మక మార్పులు సాధిస్తోంది. గతంలో భారత్‌లో బ్యాంకు ఖాతా తెరవాలంటే సమస్యగా ఉండేది. ప్రస్తుతం ఎలాంటి పత్రాలు లేకుండానే బ్యాంకు ఖాతా తెరవగలుగుతున్నారు. ఫోన్‌లోనే బ్యాంకు ఖాతా తెరిచే సౌలభ్యం వచ్చింది. 140 కోట్ల మంది ప్రజలకు భారత్ డిజిటల్ ఐడెంటిటీ తీసుకొచ్చింది. ఆవిష్కరణల పథంలో అందరూ కలిసి ముందుకు సాగాలి. ప్రతినెలా 20 బిలియన్ల డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయి. 500 మిలియన్ల మందికి డిజిటల్ హెల్త్ ఐడీలు ఇచ్చారని ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ ప్రశంసించారు. ఏఐ కృత్రిమమైనది కాదు.. వాస్తవమైనదని టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్ వ్యాఖ్యానించారు. ఏఐ సదస్సులో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. డిజిటల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ కార్యక్రమాలకు భారత్ సాక్షిగా నిలుస్తోంది. 140 కోట్ల మంది ప్రజలతో అతిపెద్ద డిజిటల్ ఐడెంటిటీ వ్యవస్థ కలిగిఉంది. ప్రపంచంలో జరిగే వాటిలో భారత్ నుంచే సగం డిజిటల్ లావాదేవీలు ఉన్నాయి. భారత్‌ను ఏఐ కేంద్రంగా ప్రధాని తీర్చిదిద్దుతున్నారు. సెమీకాన్ ఇండియా, ఇండియా ఏఐ మిషన్‌లో భాగంగా సాంకేతికత అభివృద్ధి జరుగుతోంది. ఏఐ నైపుణ్య శిక్షణలో భారత్ పురోభివృద్ధి సాధిస్తోందన్నారు. గత దశాబ్దకాలంగా ఏఐ వేగంగా ముందుకెళ్తోంది. అతి త్వరలోనే మనుషులు చేసే అత్యంత క్లిష్టమైన పనులను ఏఐ మోడళ్లు సులువుగా పూర్తి చేసే రోజులు రానున్నాయి. ఏఐతో అవకాశాలతో పాటు సవాళ్లూ ఉన్నాయి. ఆ సవాళ్లను పరిష్కరించడంలో భారత్ కీలక పాత్ర పోషించనుందని ఆంత్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ పేర్కొన్నారు.

## అహంకారంతో అక్రమ కేసులు



**నేటి సాక్షి గజ్వేల్ :** అధికారంలో ఉన్నామనే అహంకారంతో ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయిస్తూ కాంగ్రెస్ పార్టీ రాక్షస ఆనందం పొందుతోందని మాజీ ఎంపీటీసీల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్ ఘాటుగా విమర్శించారు. సిద్ధిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో ఓటమి భయంతోనే కాంగ్రెస్ నాయకులు ఉద్రిక్తతలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. టీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మాజీ మంత్రి హరీష్ రావు హాజరవుతున్నారనే భయంతో కొందరిని ప్రేరేపించి ఆర్ అండ్ ఆర్ కాలనీలో గొడవలు సృష్టించారని తెలిపారు. అనంతరం టీఆర్ఎస్ నేతలపైనే అక్రమ కేసులు నమోదు చేయించడం అధికార దుర్వినియోగానికి నిదర్శనమని అన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో జరిగిన ఘటనల్లో కాంగ్రెస్ నేతలపై కేసులు నమోదు చేయకుండా కేవలం టీఆర్ఎస్ నాయకులపైనే కేసులు పెట్టడం అధికారుల వైఖరిని స్పష్టంగా వెల్లడిస్తోందని విమర్శించారు. అధికారం శాశ్వతం కాదని, ప్రజల అవసరాలు తీర్చే నాయకుడే నిజమైన ప్రజాస్వామ్య నాయకుడిగా నిలుస్తాడని పేర్కొన్నారు. అలాగే, కే. చంద్రశేఖర్ రావు సారథ్యంలో జరిగిన తెలంగాణ ఉద్యమంలో కేసులకు, బెదిరింపులకు భయపడలేదని గుర్తుచేశారు. ఇప్పటికైనా అధికార కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని, ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన కర్తవ్యమని దేవీ రవీందర్ సూచించారు.

## ధర్మారెడ్డి పల్లిలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ




**గజ్వేల్ (సిద్దిపేట జిల్లా):** గజ్వేల్ మండలం ధర్మారెడ్డి పల్లి గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని బుధవారం ఘనంగా ఆవిష్కరించారు. మాధవరెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో, గ్రామ ప్రజాప్రతినిధులు మరియు యువజన సంఘాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. శివాజీ మహారాజ్ హిందూ ధర్మ పరిరక్షణ కోసం పోరాడిన మహాయోధుడని, పరమత సహనంతో రాజ్యాన్ని పాలించిన లౌకిక నాయకుడని కొనియాడారు. మహిళల గౌరవం, రైతుల సంక్షేమానికి ఆయన ప్రాధాన్యతనిచ్చారని, యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ సుఖేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ ముత్యాలు గౌడ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ జేజాల వెంకటేశం, మాజీ మండల ఉపాధ్యక్షుడు కృష్ణ గౌడ్, శివాజీ యూత్ సభ్యులు మరియు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ధన్వాడలో ఛత్రపతి జయంతి



**ధన్వాడ (నారాయణపేట జిల్లా):** నారాయణపేట జిల్లా ధన్వాడ గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, యువకులు మరియు వివిధ పార్టీల నాయకులు శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ.. మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించిన వీరయోధుడు శివాజీ అని కొనియాడారు. కులమత భేదం లేకుండా ప్రజలందరినీ సమానంగా చూసిన గొప్ప పాలకుడని, ఆయన ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో ధన్వాడ గ్రామ నాయకులు, యువజన సంఘాల సభ్యులు, విద్యార్థులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ అగ్రనేతలను కలిసిన మంత్రి వాకిటి శ్రీహరి



**నారాయణపేట (ఢిల్లీ):**తెలంగాణ రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి గురువారం ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలను మర్యాదపూర్వకంగా కలిశారు. లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలతో ఆయన భేటీ అయ్యారు. తెలంగాణలో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 87 మున్సిపాలిటీలు, 5 కార్పొరేషన్లను కైవసం చేసుకుని ఘనవిజయం సాధించిన నేపథ్యంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా పార్టీ సాధించిన విజయంపై అగ్రనేతలు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి వాకిటి శ్రీహరిని అభినందించారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలపై ఈ సందర్భంగా చర్చించినట్లు సమాచారం.

# ఒకటో వార్డు కౌన్సిలర్ ఆనంద్ కుమార్‌కు ఘన సన్మానం



**శంకర్ పల్లి (రంగారెడ్డి జిల్లా):** శంకర్ పల్లి మున్సిపాలిటీ ఒకటో వార్డు కౌన్సిలర్‌గా ఎన్నికైన ఆనంద్ కుమార్‌ను బుధవారం ఆదర్శనగర్ కాలనీవాసులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి చంద్రమౌళి అప్ప ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ, తన విజయానికి సహకరించిన చంద్రమౌళి అప్పకు, కాలనీవాసులకు కృతజ్ఞతలు తెలిపారు. వార్డులోని సిసి రోడ్లు, వీధిలైట్లు వంటి సమస్యలను పరిష్కరించి, అందరి సహకారంతో ఒకటో వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు నరసింహారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజు, దేవకుమార్, రవి, పవన్, మోహన్ రెడ్డి, మణికర్ రెడ్డి, నారాయణ మరియు పెద్ద సంఖ్యలో మహిళలు, యువకులు పాల్గొని ఆనంద్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# ధన్వాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫేర్వెల్ డే





- ప్రతిభావంతులైన విద్యార్థులకు సన్మానం

**ధన్వాడ (నారాయణపేట జిల్లా),** ఫిబ్రవరి 19: నారాయణపేట జిల్లా ధన్వాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు వేడుక (ఫేర్వెల్ డే) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ మహమ్మద్ అబ్దుల్ ముజీద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జేఈఈ మెయిన్స్-2026లో 73 పర్సంటైల్ సాధించి అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించిన హర్షితను, అలాగే జాతీయ మరియు రాష్ట్ర స్థాయి కోకో పోటీల్లో పతకాలు సాధించిన శైలజను ప్రిన్సిపల్ ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, తల్లిదండ్రులను గౌరవించాలని పిలుపునిచ్చారు. సమయాన్ని వృధా చేయకుండా క్రమశిక్షణతో మెలగాలని, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, అధ్యాపకులు మేరీ, ఆంజనేయులు, సాంబశివుడు, నివాస్, నరసయ్య, శివకుమార్, హనుమంతు, అత్తార్ హుస్సేన్, రామకృష్ణ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



- నిర్మాణంలో ఉన్న ఇండ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్
- లబ్ధిదారులకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం
- పనులు వేగవంతం చేయాలని

**నేటి సాక్షి - కోరుట్ల,( రాధారపు నర్సయ్య ):** జగిత్యాల జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులకు ఆదేశించారు. గురువారం కోరుట్ల మండలం ఐలాపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. పనుల పురోగతిని తెలుసుకుని అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మంజూరైన అన్ని ఇందిరమ్మ ఇండ్లను పూర్తిస్థాయిలో గ్రౌండింగ్ చేయాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి లబ్ధిదారునికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తుందని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం ఇండ్ల నిర్మాణం జరగాలని లబ్ధిదారులకు సూచించారు. ఇటుక, కంకర, బేస్‌మెంట్ వంటి నిర్మాణ సామగ్రి ధరలు లబ్ధిదారులకు అనుకూలంగా ఉండేలా అధికారుల ద్వారా కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిర్మాణ పనులు ఎక్కడైనా వెనుకబడితే వెంటనే వేగం పెంచాలని తెలిపారు. గడువులోపు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. లబ్ధిదారులకు ఆర్థిక ఇబ్బందులు ఉంటే ఐకేపి సహకార సంఘాల ద్వారా రుణాలు పొందాలని సూచించారు. దశలవారీగా బిల్లుల చెల్లింపులు ఆధార్ లింక్ చేసిన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ అవుతాయని తెలిపారు. అనంతరం మార్కింగ్, బేస్‌మెంట్, స్లాబ్ స్థాయిలో ఉన్న ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి, త్వరగా నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్, ఎంపీడీవో, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఛత్రపతి శివాజీ మహారాజ్ 399వ జయంతి



- 13వ వార్డులో వికట ఫ్రెండ్స్ యూత్, ఇండియన్ యూత్ ఆధ్వర్యంలో వైభవం
- మహానుభావునికి పుష్పాభిషేకం - యువతలో దేశభక్తి ఉత్సాహం

**నేటి సాక్షి, కోరుట్ల,( రాధారపు నర్సయ్య ):** మరాఠా యోధుడు, సనాతన ధర్మ రక్షకుడు, హిందూత్వ స్ఫూర్తి ప్రదాత అయిన ఛత్రపతి శివాజీ మహారాజ్ 399వ జయంతి సందర్భంగా 13వ వార్డులో ఘన కార్యక్రమం నిర్వహించారు. వికట ఫ్రెండ్స్ యూత్ మరియు ఇండియన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా సుదవేణి మహేష్, డాక్టర్ గంగాధర్ పాల్గొన్నారు. భవానీ మాత ఆశీర్వాదంతో వీరఖడ్గం పొంది 'నా గమ్యం హిందూత్వమ'ని నినదించిన మహనీయుడు శివాజీ మహారాజ్ అని వక్తలు పేర్కొన్నారు. అణువణువున హిందుత్వం, అడుగడుగున ధర్మధ్వజం, తనువంతా స్వాభిమానంతో పరాయిపాలకులకు సింహస్వప్నంగా నిలిచిన మహాయోధుడు అని కొనియాడారు. ఆయన బహుజన ప్రజాపతి, హైందవ బంధు దళపతి అని అభివర్ణించారు. ఈ సందర్భంగా శివాజీ మహారాజ్ చిత్రపటానికి పుష్పాభిషేకం నిర్వహించి నివాళులు అర్పించారు. యువత దేశభక్తి, ధర్మరక్షణ భావనతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వికట ఫ్రెండ్స్, ఇండియన్ యూత్, ఏబీవీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.రవి యాదవ్, వినయ్, రిషి, మధు, మహేందర్, సుధవేణి శేఖర్, మల్కన, ముక్కెర లక్ష్మణ్, కీర్తి కుమార్, గడల రాజు యాదవ్, మచ్చ మహి, వాస్ భరత్, పోతుగంటి రవి శంకర్ యాదవ్, శ్రీకాంత్ చారి, శ్రీనాథ్, హర్షిత్, ఉదయ్, హేమంత్, లోకేష్, మనోజ్, రమేష్ యాదవ్, ఆదిత్య, శివచైతన్య, భరత్, బన్నీ, కార్తీక్, కిరణ్, చేతన్, శరత్ తదితరులు పాల్గొన్నారు. 13వ వార్డు ప్రజలు భారీగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కోరుట్లలో ఛత్రపతి శివాజీ జయంతి



**నేటి సాక్షి కోరుట్ల:** కోరుట్ల పట్టణంలోని అయిలాపూర్ రోడ్డులో గల శంకర్ ఫోటో స్టూడియో వద్ద ఛత్రపతి శివాజీ మహారాజ్ 399వ జయంతి వేడుకలను స్థానిక వ్యాపారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ.. సనాతన ధర్మ రక్షకుడు, స్వాభిమానానికి ప్రతీక అయిన శివాజీ మహారాజ్ జీవితం అందరికీ ఆదర్శమని కొనియాడారు. ఆయన ధైర్యం, దేశభక్తిని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అనుమల్ల శంకర్, గంగం అశోక్ రెడ్డి, కొమ్ముల జగపతి రెడ్డి, బిల్లా రాజగంగారాం, వాసం రవికుమార్, కల్లెం గంగారెడ్డి, గోసికొండ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# బాలికల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్



- అదనపు తరగతి గదులు, సైన్స్ ల్యాబ్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశం
- పీఎంశ్రీ పాఠశాలలో పురోగతిపై సమీక్ష

**నేటి సాక్షి - కోరుట్ల ( రాధారపు నర్సయ్య ):** జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం కోరుట్లలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలికల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో నిర్మాణంలో ఉన్న రెండు అదనపు తరగతి గదులు మరియు సైన్స్ ల్యాబ్ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంజినీర్‌ను పనుల స్థితిగతులు గురించి అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థినులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి కె. రాము, సెక్టోరియల్ ఆఫీసర్ సీహెచ్. సత్యనారాయణ, ఏఈ ధనుంజయ్, శశికుమార్, కోరుట్ల మండల విద్యాధికారి గంగుల నరేశం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. గంగాధర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# కోరుట్ల పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తాం.!





- మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత-గంగాధర్ గౌడ్ హామీ
- 16వ వార్డులో చైర్‌పర్సన్ దంపతులకు ఘన సన్మానం

**నేటి సాక్షి - కోరుట్ల, ( రాధారపు నర్సయ్య ):** కోరుట్ల మున్సిపాలిటీని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత-గంగాధర్ గౌడ్ అన్నారు. గురువారం పట్టణంలోని 16వ వార్డులో తాజా మాజీ కౌన్సిలర్ బలిజ పద్మ, 16వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి బలిజ రాజారెడ్డి ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ దంపతులను, వైస్ చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి జువ్వాడి నర్సింగారావు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావుల సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు. ప్రతి వార్డులో ఉన్న సమస్యలను తెలుసుకొని నిధులు మంజూరు చేయించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా కృషి చేస్తామని చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారం దిశగా నిరంతరం పని చేస్తామని, తమపై నమ్మకంతో పదవులు అందించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సాహిద్, 3వ వార్డు కౌన్సిలర్ మోర్తాడ్ లక్ష్మీనారాయణ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సంఘ రాష్ట్ర నాయకులు ఉయ్యాల నరసయ్య, మాజీ కౌన్సిలర్ చిట్యాల లక్ష్మణ్, మైస ఆనంద్, యాటం అరుణ్, డాక్టర్ అబ్దుల్లా, గురువంతుల సత్తయ్య, ఉయ్యాల శేఖర్, కండ్లే మైకల్, బలిజ శివప్రసాద్, నజీముద్దీన్, అయూబ్, రాజు వీర్, తిరుపతి, రవి, శేఖర్, మైస రాజేష్, బలిజ సంతోష్ కుమార్, ఉయ్యాల మాదేశ్, మైస నవీన్, నరేందర్, వార్డు ఆఫీసర్ జగదీశ్వర్, ఆర్పీ పావని, అంగన్వాడీ టీచర్ ప్రభ, పసుల దేవరత్న, గుడిసెల తుక్కమ్మ, పసుల శాంత, ఉయ్యాల భారతి, కండ్లే రాజమణి, చిట్యాల గంగు, గుడిసెల మాధవి, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీడీవో షేక్ సిలర్ సాహెబ్ కు వినతి పత్రం



**నేటి సాక్షి తిరుమలాయపాలెం(రుద్రరాజు):** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండల కేంద్రంలో మంజూరైన ఐటిఐ కళాశాల పనులను ప్రారంభించాలని ఎంపీడీవో షేక్ షీలా సాహెబ్ కు వినతి పత్రం అందజేసిన సిపిఎం బృందం. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను మాట్లాడుతూ కళాశాల మంజూర అయి సంవత్సరం గడుస్తున్నప్పటికీ నేటి వరకు పనులు ప్రారంభించకపోవడం దారుణమని వెంటనే మండల కేంద్రంలో రోడ్డు పక్కన స్థలంలో ఐటిఐ కళాశాల పనులను ప్రారంభించాలని కోరుతూ ఎంపీడీవో గారికి వినతి పత్రం అందించడం జరిగింది పాలేరు నియోజకవర్గంలో అన్ని మండలాల్లో పనులు వేగవంతంగా జరుగుతున్న తిరుమలాయపాలెం మండలానికి వచ్చేసరికి మంజూరైన పనులు కూడా ప్రారంభించడం లేదని తిరుమలాయపాలెం మండలం పట్ల ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని మండల కేంద్రంలో మంజూరైన పనులు వేగంగా సాగుతూ తిరుమలాయపాలెం మండలంలో మాత్రం పనులు చేయడంలో పట్టించుకోవడంలేదని ఆయన అన్నారు ఇప్పటికైనా ఐటిఐ కళాశాల పనులు మరియు మాత శిశు కేంద్రం హాస్పిటల్ పనులు కూడా ప్రారంభం కావట్లేదని ఇప్పటికైనా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చొరవ తీసుకొని పనులు వేగవంతంగా జరపాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మండల నాయకులు తుళ్లూరు నాగేశ్వరరావు పాండవుల నాగేశ్వరరావు కొమ్ము నాగేశ్వరరావు బాలాజీ వెంకన్న నిర్మల రావు నగేష్ తదితరులు పాల్గొన్నారు

# ఛత్రపతి శివాజీ మహారాజ్ ముస్లిం వ్యతిరేకి కాదు



- సీపీఐ జిల్లా నేత సుతారి రాములు వ్యాఖ్యలు
- సి. ప్రభాకర్ స్మారక గ్రంథాలయంలో జయంతి వేడుకలు

**నేటి సాక్షి - కోరుట్ల,( రాధారపు నర్సయ్య ):** కోరుట్ల డివిజన్ కేంద్రంలోని సి. ప్రభాకర్ స్మారక గ్రంథాలయం కమిటీ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి సీపీఐ జిల్లా నేత, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సుతారి రాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుతారి రాములు మాట్లాడుతూ, శివాజీ మహారాజ్ మరాఠా వీరుడు, ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేసిన ధైర్యశాలి అని పేర్కొన్నారు. ఆయన ముస్లిం వ్యతిరేకి కాదని స్పష్టం చేశారు. 1627 ఫిబ్రవరి 19న పూణే సమీపంలోని శివనేరి కోటలో జన్మించి, 1672లో రాయగడ్ కోటలో పట్టాభిషేకం పొందారని వివరించారు. శివాజీ మహారాజ్ సైన్యంలో ముస్లింలకు కీలక బాధ్యతలు అప్పగించారని తెలిపారు. నౌకాదళంలో, ఆయుధాగారంలో, విదేశీ వ్యవహారాలలో, సేనాధిపతులుగా ముస్లిం నాయకులు సేవలందించారని గుర్తు చేశారు. శివాజీ రాజ్యం ప్రజా సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని సాగిందని, రైతులకు సంక్షేమం అందేలా కృషి చేశారని చెప్పారు. మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల మాదిరిగా శివాజీ ఆశయాలు కూడా నేటి తరానికి అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు, యువకులు శివాజీ మార్గదర్శకత్వంలో సమాజ సేవకు కట్టుబడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సి. ప్రభాకర్ స్మారక గ్రంథాలయ గౌరవ అధ్యక్షులు చెన్న విశ్వనాథం, అధ్యక్షులు రాస భూమయ్య, వృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షులు రాచకొండ పెద్ద దేవయ్య, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు ఎండి సమీర్, అందె వంశీకృష్ణ, అడ్వకేట్ గంగాధర్, పాఠకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు గోటూర్‌కు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రామ్ శేఖర్



**నేటిసాక్షినారాయణపేట(ఇమామ్ సాబ్)**నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం గోటూర్ గ్రామంలో నిర్వహించనున్న 'బహుజన ధూమ్ ధామ్' కార్యక్రమానికి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రామ్ శేఖర్ హాజరుకానున్నారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు బొదిగెలి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, జిల్లాలోని మేధావులు, విద్యార్థులు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ ధూమ్ ధామ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# యూజీసీ నెట్‌లో రజని ప్రతిభ




**నేటి సాక్షి గన్నేరువరం (బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండలం గునుకుల కొండాపూర్ గ్రామానికి చెందిన కమటం రజని (లావణ్య) దేశవ్యాప్తంగా నిర్వహించిన యూజీసీ నెట్ పరీక్షలో ఇంగ్లీష్ సబ్జెక్టులో పీహెచ్‌డీ (PhD) కి అర్హత సాధించారు. గృహిణిగా ఉంటూనే ఉన్నత విద్యా లక్ష్యంతో శ్రమించి ఈ విజయాన్ని అందుకోవడం విశేషం. ఈ సందర్భంగా ప్రజా కవి, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, సీనియర్ జర్నలిస్ట్ కొండమల్లు, రచయిత వర్దేల్లి వెంకటేశ్వర్లు, కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లింగంపల్లి నాగరాజు, తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్ మరియు కుటుంబ సభ్యులు రజనిని ప్రత్యేకంగా అభినందించారు.

# ఛత్రపతి శివాజీ వేడుకలు



**నేటి సాక్షి, గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండల కేంద్రం లోని యువసేన కార్యాలయంలో వివేకానంద యూత్ అధ్యక్షుడు గూడూరి సురేష్ ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ కి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గూడూరి సురేష్ మాట్లాడుతూ చత్రపతి శివాజీ పోరాటం స్ఫూర్తితో గన్నేరువరం మండలం అభివృద్ధి సమస్యలపై పోరాటం చేసి అభివృద్ధి సంక్షేమాన్ని అందించామని ఇప్పటికీ ప్రజా సమస్యల పైన కొట్లాడుతున్నామని తొందర్లోనే మండల కేంద్రంలో భారీ చత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు కోసం కృషి చేస్తున్నామని తెలిపారు గన్నేరువరం గ్రామ యువకుల కోసం ఉన్నత ఉద్యోగాల కోసం చదువుకోడానికి ప్రిపేర్ కావడానికి యువసేన కార్యాలయంలో మార్చి మొదటి వారంలో గ్రంధాలయం ప్రారంభిస్తామని ఎవరైనా జన్మదిన వేడుకలకు ఒక బుక్కును బహుమతిగా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొలుపుల సుధీర్, కందాల నవీన్ గౌడ్, తాటికొండ తిరుపతి, కొండ అన్వేష్, గుండా నరహరి గౌడ్, నల్లగొని సతీష్, బత్తిని శేఖర్, గూడూరి గౌతమ్, పొన్నాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# వీఆర్వోలకు పని ఒత్తిడిని తగ్గించాలి..



**నేటి సాక్షి, పాములపాడు :** ప్రభుత్వ శాఖలలో అత్యంత కీలకమైన రెవెన్యూ శాఖలో పనిచేసే విఆర్ఓ లపై అధిక పని ఒత్తిడిని తగ్గించి వర్క్ టు రూల్ అమలు చేయాలని వీఆర్వోల సంఘం మండల అధ్యక్షుడు హుస్సేన్ సాహెబ్ అన్నారు గురువారం తాసిల్దార్ కార్యాలయం ఎదుట విఆర్వోలు నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించి వినతి పత్రాన్ని తాసిల్దార్ సుభద్రమ్మకు అందించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విఆర్వోల న్యాయపరమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు అంతేగాక వర్క్ టు రూల్ జనవరి 12 నుంచి అమలుకు ఒప్పందం చేసుకొని ఇంతవరకు వర్తింప చేయడం లేదని ఇది ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు పొలాల రీ సర్వేలో భాగంగా అధికారులు ఏమైనా పొరపాట్లు చేస్తే వాటికి వీఆర్వోలను బాధ్యులుగా చేయడం సరైనది కాదన్నారు విఆర్ఓ లపై అధిక పని ఒత్తిడి కారణంగా కొంతమంది వీఆర్వోలు మానసిక ఒత్తిడికి గురై రోడ్డు ప్రమాదాలకు గురికావడం ఆత్మహత్యలకు పాల్పడడం వంటి సంఘటనలు ఈమధ్య తరచు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు ప్రభుత్వం వీఆర్వోలపై అధిక పని ఒత్తిడిని తగ్గించాలని వారు డిమాండ్ చేశారు ఇటీవల మృతి చెందిన కొంతమంది వీఆర్వోల మృతికి సంతాపాన్ని ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు వీఆర్వోల న్యాయపరమైన సమస్యలు తక్షణమే పరిష్కరించకపోతే రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఉద్యమ పోరాటాలు చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో విఆర్వోలు శివన్న మూర్తుజావలి మహబూబ్ బాషా శ్రీనివాసులు మద్దిలేటి పురందరుడు మక్బుల్ భాష పాల్గొన్నారు

# శ్రీలంక గడ్డపై జింబాబ్వే సంచలనం విజయం..

## టేబుల్ టాపర్‌గా రజా సేన

టీ20 ప్రపంచకప్ 2026లో జింబాబ్వే అద్భుత ప్రదర్శన కనబరుస్తోంది. టోర్నీలో పెద్ద జట్లను కుదిపేయాలని కెప్టెన్ సికందర్ రజా ఇప్పటికే కంకణం కట్టుకున్నాడు. తాజాగా శ్రీలంక జట్టును ఆ దేశ ఓన్ గ్రౌండ్‌లోనే ఓడించింది. ఈ గ్రాండ్ విక్టరీతో సూపర్-8కు ముందే గ్రూప్‌ఉబీలో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఇప్పటికే ఆస్ట్రేలియా లాంటి భారీ టీమ్‌ను ఓడించి సూపర్-8లోకి అర్హత సాధించిన జింబాబ్వే.. తాజాగా శ్రీలంకను సైతం ఓడించి గ్రూప్ టాపర్‌గా నిలిచింది. ప్రస్తుతం అంతర్జాతీయ టీ20 ర్యాంకింగ్స్‌లో జింబాబ్వే స్థానం చాలా తక్కువ. కానీ ఎనిమిదో స్థానంలో ఉన్న శ్రీలంకను ఓడించడం పెద్ద అప్‌సెట్‌గా మారింది. గత ఏడాది కూడా జింబాబ్వే శ్రీలంకపై రెండు సార్లు గెలిచింది. 2024లోనూ ఒకసారిఓడించింది. ఇప్పటివరకు ఈ రెండు జట్ల మధ్య జరిగిన పన్నెండు మ్యాచ్‌లలో శ్రీలంక ఎనిమిది గెలిచినా, జింబాబ్వే నాలుగు విజయాలతో తమ పోరాటస్ఫూర్తిని చూపించింది. కొలంబో ఆర్‌పీఎస్ మైదానం మాత్రం శ్రీలంకకు అదృష్టం కలిగించలేకపోతోంది. అక్కడ ఆడిన 34 మ్యాచ్‌లలో కేవలం తొమ్మిది విజయాలే రావడం బలహీనతను బయటపెట్టింది. ఈ మ్యాచ్‌లో శ్రీలంక మొదట బ్యాటింగ్ చేసి మంచి ఆరంభం చేసింది. పాతుమ్ నిస్సంక అద్భుతంగా ఆడి 41 బంతుల్లో 62 పరుగులు చేశాడు. చివరి ఓవర్లలో పావన్ రత్నాయకే వేగంగా 25 బంతుల్లో 44 పరుగులు చేసి జట్టును 178 పరుగుల బలమైన స్కోరుకు చేర్చాడు. జింబాబ్వే బౌలర్లలో గ్రేమ్ క్రీమర్, బ్లెసింగ్ ముజరబాని, బ్రాడ్ ఇవాన్స్ ఇద్దేసి వికెట్లు తీసి పరుగులు అదుపులో పెట్టారు. 179 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే బ్యాటింగ్ చాలా పద్ధతిగా సాగింది. బ్రియాన్ బెన్నెట్ మరోసారి అద్భుతంగా ఆడి 63 పరుగులతో జట్టుకు పునాది వేశాడు. ఈ ప్రపంచకప్‌లో వరుసగా మూడో అర్ధశతకం ఇది. ఓమాన్‌పై 48 నాటౌట్, ఆస్ట్రేలియాపై 64 నాటౌట్‌గా నిలిచి శ్రీలంకపై అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. కెప్టెన్ సికందర్ రజా 45 పరుగులతో మ్యాచ్‌ను జింబాబ్వే వైపు తిప్పేశాడు. చివరకు 19.3 ఓవర్లలోనే నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించారు. ఈ విజయంతో తమ గ్రూపులో అగ్రస్థానాన్ని సంపాదించారు.






# బాబర్‌ను తీసేయాలని చెప్తే, నన్నే తీసేశారు

## పాక్ మాజీ సంచలన వ్యాఖ్యలు

### బాబర్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన యూసుఫ్..

టీ20 వరల్డ్ కప్‌లో భారత్ చేతిలో పాకిస్తాన్ ఘోర పరాజయం ఆ దేశంలో తీవ్ర ఆగ్రహానికి కారణమవుతోంది. అభిమానులు, పాక్ మాజీలు పాక్ టీమ్‌పై, ప్లేయర్ల ఆటతీరుపై విరుచుకుపడుతున్నారు. ముఖ్యంగా, పాకిస్తాన్ స్టార్ ఆటగాడిగా భావించే బాబర్ అజమ్‌పై విమర్శలు ఎక్కు పెడుతున్నారు. బాబర్‌తో పాటు షహీన్ అఫ్రిది, షాదాబ్ ఖాన్‌పై పాకిస్తాన్ మాజీ క్రికెటర్లు విరుచుకుపడుతున్నారు. తాజాగా, పాకిస్తాన్ మాజీ ఆటగాడు మహ్మద్ యూసుఫ్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. బాబర్ ప్రస్తుత టీ20 వరల్డ్ కప్‌లో రన్స్ చేయడంలో దారుణంగా విఫలమవుతున్నాడు. మూడు మ్యాచుల్లో కేవలం 66 పరుగులు మాత్రమే చేశాడు. యూనస్ మాట్లాడుతూ.. బాబర్‌ను టీం నుంచి డ్రాప్ చేయాలని తాను సెలక్టర్‌గా ఉన్నప్పుడు సూచించానని, కానీ అందరూ తనపై తిరుగుబాటు చేసి, రాజీనామా చేసేలా చేశారని ఆయన అన్నారు. గత 2-3 ఏళ్లుగా బాబర్ టెక్నిక్ పూర్తిగా దెబ్బతిందని, అతను ఫామ్‌లో లేడని అన్నారు. నిజానికి ఒక ప్లేయర్ ఫామ్ లేకపోవడం కేవలం ఒకటి రెండు టోర్నీలో మాత్రమే ఉంటుందని, కానీ బాబర్ మూడు ఏళ్లుగా పెద్ద స్కోర్లు చేయడంలో విఫలమవుతున్నాడని యూసుఫ్ విమర్శించారు. బాబర్‌ను టీం నుంచి తీసేయాలని నేను చెబితే, మేనేజ్మెంట్ తిరస్కరించిందని, చివరకు తాను సెలక్టర్ పదవికి రాజీనామా చేయాల్సి వచ్చిందని యూసుఫ్ చెప్పారు. బాబర్‌ను తమ కాలం నాటి దిగ్గజ ప్లేయర్లతో పోల్చే స్థాయి కాదని స్పష్టం చేశారు. ఇంజమామ్ ఉల్ హక్, సయీద్ అన్వర్, జహీర్ అబ్బాస్ వీరి స్థాయి వేరే అని, వీరిని బాబర్ మ్యాచ్ చేయలేదని అన్నారు.

# వాహ్ నువ్వు తోపు భయ్యా!

## ఒకే మ్యాచ్‌లో 4 వికెట్లు.. 4 క్యాచ్‌లు.. వరల్డ్ రికార్డ్!




**కోల్‌కతా:** టీ20 వరల్డ్ కప్ జోరుగా సాగుతోంది. రికార్డులు, విజయోత్సవాల మధ్య ఈ వరల్డ్ కప్ మ్యాచ్‌లు కొనసాగుతున్నాయి. అయితే.. తాజాగా కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ మైదానంలో వెస్టిండీస్ జట్టు ఇటలీపై 42 పరుగుల తేడాతో గెలిచింది. ఇది ఆ జట్టుకు వరుసగా నాలుగో గెలుపు. ఇటలీ మొదటిసారి ఈ ప్రపంచకప్ ఆడుతోంది. ఈ మ్యాచ్‌లో తగ్గేదేలే అన్న రీతిలోనే మొదట దూసుకుపోయింది. పవర్‌ప్లేలోనే బ్రాండన్ కింగ్, షిమ్రోన్ హెట్‌మైర్‌లను ఔట్ చేసి వెస్టిండీస్‌ను కాస్త ఒత్తిడిలోకి నెట్టింది. ఈ సమయంలో కెప్టెన్ షాయ్ హోప్ ఓపికగా ఆడాడు. మరోవైపు వికెట్లు పడుతూనే ఉన్నా కెప్టెన్ మాత్రం చివరివరకు నిలబడి 46 బంతుల్లో 75 పరుగులు చేసి జట్టును 165 పరుగుల వరకూ తీసుకెళ్లాడు. ఇటలీ బౌలర్లు క్రిషన్, కెప్టెన్ బెన్ మానెంటీ కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. 165 పరుగుల లక్ష్యంతో ఇటలీ గ్రౌండ్‌లోకి దిగింది. ఈ జట్టు బ్యాటింగ్ మొదలుపెట్టినప్పుడు మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. మోస్కా సోదరులు వేగంగా పరుగులు తీయడానికి ప్రయత్నించారు. కానీ వెస్టిండీస్ బౌలర్లు ఒక్కసారిగా మ్యాచ్ దిశ మార్చేశారు. షమర్ జోసెఫ్ అద్భుతంగా బౌలింగ్ వేస్తూ 30 పరుగులకు నాలుగు వికెట్లు తీసుకున్నాడు. అతనికి తోడుగా మాథ్యూ ఫోర్డ్ సైతం 19 పరుగులకు మూడు వికెట్లు తీసి ఇటలీ ఆశలను చెదరగొట్టాడు. చివరకు ఇటలీ జట్టు 18వ ఓవర్‌లోనే మొత్తం ఔట్ అయింది. అయితే.. ఈ మ్యాచ్‌లో షమర్ జోసెఫ్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. ఏకంగా నాలుగు వికెట్లు తీయడమే కాకుండా.. నాలుగు క్యాచ్‌లు పట్టి ఒక అరుదైన రికార్డు సృష్టించాడు. ఒకే మ్యాచ్‌లో నాలుగు వికెట్లు తీసి నాలుగు క్యాచ్‌లు పట్టిన తొలి ఆటగాడిగా చరిత్రలో నిలిచాడు. ఇరవై ఓవర్ల ఆటలో నాలుగు వికెట్లు తీసుకోవడం పెద్ద విషయం. నాలుగు క్యాచ్‌లు పట్టడం కూడా చాలా అరుదు. ఈ రెండూ రికార్డులు ఒకే మ్యాచ్‌లో జరగడం దాదాపు అసాధ్యమే. కానీ జోసెఫ్ అసాధ్యాన్ని సుసాధ్యం చేశాడు. టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌ల్లో వికెట్‌కీపర్ కాకుండా నాలుగు క్యాచ్‌లు పట్టిన ప్లేయర్ల జాబితాలో డారెన్ సామీ, ఏడెన్ మార్క్రామ్, గ్లెన్ మాక్స్‌వెల్, జార్జ్ మున్సీతో పాటు ఇప్పుడు షమర్ జోసెఫ్ పేరు చేరింది.

# యూనస్ ఎగ్జిట్

## భారత క్రికెట్ సంబంధాల కోసం బంగ్లాదేశ్ ఆరాటం..

### సమస్యల్ని చర్చల ద్వారా పరిష్కరించుకుంటామన్న కొత్త మంత్రి







**ఢాకా:** టీ20 ప్రపంచ కప్‌లో బంగ్లాదేశ్, పాకిస్తాన్ చేసిన రచ్చ అంతా ఇంతా కాదు. బంగ్లాదేశ్‌లోని మహ్మద్ యూనస్ సర్కార్ తన రాజకీయ స్వలాభం కోసం భారత్‌ను బూచిగా చూపించే విధంగా గేమ్ ఆడారు. బంగ్లా ప్లేయర్లు భారత్‌లో ఆడేందుకు సిద్ధంగా ఉన్నా.. భారత్‌తో భద్రతా సమస్యలు ఉన్నాయని తమ టీం అక్కడ ఆడదంటూ వితండవాదం చేశారు. చివరకు ఐసీసీ బంగ్లాదేశ్‌ను టోర్నీ నుంచి నిషేధించింది. ఇదిలా ఉంటే, ప్రస్తుతం తారిక్ రెహ్మాన్ నేతృత్వంలో బీఎన్పీ ప్రభుత్వం అక్కడ అధికారంలోకి వచ్చింది. మహ్మద్ యూనస్ అధికారం పోయింది. దీంతో, ఇప్పుడు భారత్‌తో సంబంధాలను మెరుగుపరుచుకోవాలని చూస్తోంది. క్రికెట్ సంబంధాలను మళ్లీ నెలకొల్పాలని బంగ్లా కొత్త క్రీడా మంత్రి అమీనుల్ హక్ భావిస్తున్నారు. భారత డిప్యూటీ హైకమిషనర్‌తో చర్చలు జరిపినట్లు హక్ చెప్పారు. "స్నేహపూర్వకం చర్చల"ద్వారా విభేదాలను పరిష్కరించుకోవాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మొత్తం వివాదానికి కారణమైన బంగ్లాదేశ్ బోర్డును కూడా హక్ విమర్శించారు. పొరుగుదేశాలో స్నేహపూర్వక సంబంధాలు పెంచుకోవాలని ఆయన అన్నారు. దౌత్యపరమైన సమస్య కారణంగా బంగ్లా టీం టీ20 వరల్డ్ కప్ ఆడలేకపోయిందని, ఒక వేళ చర్చించి పరిష్కరించుకుంటే ఇప్పుడు తమ టీం టోర్నీలో ఆడుతూ ఉండేదని ఆయన అన్నారు. షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్ మద్దతుదారులుగా ఉన్న క్రికెటర్లు షకీబ్ అల్ హసన్, మష్రఫే మోర్తాజాపై ఉన్న కేసులను పరిష్కరించడం ద్వారా జాతీయ జట్టులోకి వస్తారని హక్ అన్నారు. గతంలో ఈ ఇద్దరు అవామీ లీగ్ ఎంపీలుగా పనిచేశారు. యూనస్ అధికారం చేపట్టిన తర్వాత విదేశాల్లో ఉంటున్న షకీబ్ బంగ్లాకు తిరిగిరాలేదు. ఇక మోర్తజా బహిరంగంగా కనిపించడం లేదు.

# డైరెక్ట్ ఎంట్రీ సాధించిన 12 జట్లు!

## 21 నుంచి సూపర్ 8 ..

అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) 2028లో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వేదికలుగా జరగనున్న టీ20 ప్రపంచకప్‌కు సంబంధించి కీలక అప్డేట్ ఇచ్చింది. ప్రస్తుతం జరుగుతున్న 2026 వరల్డ్ కప్‌లో సూపర్ 8కు చేరిన జట్ల ఆధారంగా తదుపరి టోర్నీకి నేరుగా అర్హత సాధించే టీమ్స్‌ను దాదాపు ఖరారు చేసింది. నిబంధనల ప్రకారం ఆతిథ్య దేశాలైన ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లు నేరుగా అర్హత సాధించగా.. 2026 ఎడిషన్‌లో సూపర్ 8కు చేరిన భారత్, పాకిస్తాన్, వెస్టిండీస్, ఇంగ్లాండ్, సౌతాఫ్రికా, శ్రీలంక, జింబాబ్వే జట్లు కూడా తమ స్థానాలను భద్రపరుచుకున్నాయి. మొత్తం 20 జట్లు పాల్గొనే ఈ మెగా టోర్నీలో ఇప్పటికే 9 జట్లు డైరెక్ట్ ఎంట్రీని ఖాయం చేసుకున్నాయి. ఇక మిగిలిన మూడు స్థానాలను ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ ఆధారంగా భర్తీ చేయనున్నారు. మార్చి 9వ తేదీని కట్-ఆఫ్ డేట్‌గా నిర్ణయించగా.. అప్పటిలోపు పెద్దగా అంతర్జాతీయ మ్యాచ్‌లు లేకపోవడంతో ప్రస్తుతం ఉన్న ర్యాంకింగ్స్ ప్రకారమే అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్, ఐర్లాండ్ జట్లు నేరుగా క్వాలిఫై అయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా బంగ్లాదేశ్ విషయంలో ఇది ఊరట కలిగించే అంశం. 2026 వరల్డ్ కప్‌లో భద్రతా కారణాల దృష్ట్యా భారత్‌లో ఆడేందుకు నిరాకరించినందుకు గానూ ఆ జట్టును ఐసీసీ టోర్నీ నుంచి తప్పించింది. అయితే, ర్యాంకింగ్స్ పరంగా మెరుగ్గా ఉండటంతో 2028 టోర్నీలో ఆ జట్టు తిరిగి భాగం కానుంది. కాగా గతేడాది భారత్‌కు వచ్చిన స్కాట్లాండ్ జట్టు ఈసారి మాత్రం రీజినల్ క్వాలిఫైయర్స్ ద్వారా తన అదృష్టాన్ని పరీక్షించుకోవాల్సి ఉంటుంది. మొత్తంగా 12 జట్లు నేరుగా అర్హత సాధించగా.. మిగిలిన 8 స్థానాల కోసం ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో రీజినల్ క్వాలిఫైయర్ రౌండ్లు జరగనున్నాయి. ఈ క్వాలిఫైయర్ మ్యాచ్‌లు వచ్చే రెండేళ్లలో పూర్తి కానున్నాయి. ఐసీసీ తన అధికారిక ప్రకటనను మార్చి 9న వెలువరించనుంది. ప్రస్తుత వర్ల్డ్ కప్‌లో సూపర్ 8 ఫిబ్రవరి 21 నుంచి ప్రారంభం కానుంది.






# కేరళ స్టోరీ-2కు 'యూ/ఏ' సర్టిఫికెట్ జారీ






మనోజ్ బాజ్‌పేయి చిత్రం 'ఘూస్‌ఖోర్ పండత్' టైటిల్‌పై సుప్రీంకోర్టు ఆంక్షలు విధించిన తరుణంలో మరో వివాదాస్పద చిత్రం 'ది కేరళ స్టోరీ 2' విడుదలకు లైన్ క్లియర్ అయింది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు 'యూ/ఏ' సర్టిఫికెట్‌ను జారీ చేసింది. దీనివల్ల 14 ఏళ్లు పైబడిన వారు ఈ సినిమాను వీక్షించే అవకాశం లభించినట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ నిర్ణయంపై చిత్ర నిర్మాత విపుల్ అమృత్‌లాల్ షా స్పందిస్తూ, సెన్సార్ బోర్డు తమ కథలోని నిజాయితీని నమ్మిందని, బోర్డు సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. మత మార్పిడి వంటి సున్నితమైన అంశాలతో రూపొందిన ఈ చిత్రంపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఇప్పటికే తీవ్ర విమర్శలు చేశారు. ఇది రాష్ట్రాన్ని కించపరిచేలా ఉన్న 'విద్వేషపూరిత ప్రోపగాండా' అని ఆయన అభివర్ణించారు. కేరళలోని లౌకిక సంప్రదాయాన్ని దెబ్బతీసేందుకు ఇలాంటి సినిమాలు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. అయితే నిర్మాత విపుల్ షా మాత్రం, ఈ సినిమా యువతులకు మరియు కుటుంబాలకు అవగాహన కల్పించేందుకు ఉద్దేశించినదని అందుకే సెన్సార్ బోర్డు సానుకూలంగా స్పందించిందని అభిప్రాయపడ్డారు. కామఖ్య నారాయణ్ సింగ్ దర్శకత్వంలో ఉల్కా గుప్త, అదితి భాటియా మరియు ఐశ్వర్య ఓజా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాను విపుల్ షా నిర్మించాడు. ఈ చిత్రం ఫిబ్రవరి 27, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

# అత్యాచార పాత్రలో నటించడం ఈజీ కాదు



తాప్సీ పన్నూ ప్రధాన పాత్రలో బాలీవుడ్ దర్శకుడు అనుభవ సిన్హా దర్శకత్వంలో తెరకెక్కిన 'అస్సి' చిత్రంలో అత్యాచార బాధితురాలిగా నటించిన మలయాళ నటి కని కుస్రుతి తన పాత్ర గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఫిబ్రవరి 20న ఈ చిత్రం విడుదల కాబోతుండగా.. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఆమె మాట్లాడుతూ.. తాను ఈ చిత్రంలో 'పరిమ' అనే వివాహిత పాత్రలో నటించబోతున్నట్లు తెలిపింది. అత్యాచారానికి గురైన ఒక మహిళ అనుభవించే మానసిక వేదనను వేరొకరు పూర్తిగా అర్థం చేసుకోవడం అనేది చాలా కష్టమైన విషయం. అలాంటి పాత్రలో తాను నటించడం చాలా సవాలుతో కూడుకున్నది. ఒక నటిగా ఆ వేదనకు సాధ్యమైనంత దగ్గరగా వెళ్లడానికి ప్రయత్నించానని, కొన్ని క్షణాల్లో అది నిజంగా తనకే జరుగుతోందా అనేంతగా లీనమయ్యానని కని తెలిపారు. అయితే ఆ ట్రామాలోకి పూర్తిగా వెళ్లడం వల్ల వ్యక్తిగతంగా తనపై ప్రభావం పడుతుందనే ఉద్దేశంతో కొంత దూరం పాటించానని ఆమె వివరించారు. భారతదేశంలో పెరుగుతున్న ఒక మహిళగా ఇలాంటి దాడులు లేదా వేదనల గురించి అవగాహన ఉండటం తనకు సహజమని తెలిపిన కని.. తన సన్నిహితులు కూడా ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవడం వల్ల ఇది మన చుట్టూ ఉండే చేదు వాస్తవమని కని పేర్కొన్నారు. ఈ సినిమా ద్వారా భారతీయ న్యాయ వ్యవస్థలోని క్లిష్టతలను కూడా తాను అర్థం చేసుకున్నానని, కోర్టు విచారణల సమయంలో బాధితులు పాత గాయాలను మళ్లీ తలుచుకుంటూ ఎంత నరకం అనుభవిస్తారో తనకు అర్థమైందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలో నివసించే పరిమ అనే మహిళ కిడ్నాప్‌కు గురై, సామూహిక అత్యాచారానికి గురైన తర్వాత ఆమె న్యాయం కోసం చేసే పోరాటం చుట్టూ ఈ చిత్ర కథ తిరుగుతుంది. ఈ చిత్రంలో తాప్సీ పన్నూ లాయర్‌గా నటించగా, మహమ్మద్ జీషన్ అయ్యూబ్, మనోజ్ పహ్వా, రేవతి తదితరులు కీలక పాత్రలు పోషించారు. దేశంలో రోజుకు సగటున నమోదవుతున్న 80 అత్యాచార కేసులను సూచిస్తూ ఈ చిత్రానికి 'అస్సి' (హిందీలో 80) అని పేరు పెట్టారు.

# విశ్వక్‌సేన్ డైరెక్షన్‌లో కల్ట్

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మరోసారి మెగా ఫోన్ పట్టాడు. విశ్వక్ స్వీయ దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'కల్ట్' . 'ఫలక్‌నుమా దాస్', 'దాస్ కా దమ్కీ' వంటి సినిమాల తర్వాత ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం కావడంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం ఎంతో ఉత్కంఠభరితంగా, సాహసోపేత మైన కథాంశంతో ఉండబోతుందని తెలుస్తుంది. మరోవైపు ఈ సినిమా ద్వారా ఏకంగా 40 మంది కొత్త నటీనటులను వెండితెరకు పరిచయం చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందులో గాయత్రి భరద్వాజ్ కథానాయికగా నటిస్తున్నట్లు సమాచారం. వియత్నాంలో జరిగిన నిజ జీవిత సంఘటనల ఆధారంగా, నేటి కాలపు యువతను ఆకట్టుకునేలా ఒక కొత్త తరహా కథను విశ్వక్ సేన్ స్వయంగా రాసి తెరకెక్కించినట్లు తెలుస్తుంది. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర పోస్టర్లు మరియు ప్రచార చిత్రాలు సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. అయితే తాజాగా ఈ సినిమా టీజర్‌ను ఫిబ్రవరి 21న విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ చిత్రానికి 'కేజీఎఫ్' ఫేమ్ రవి బస్రూర్ సంగీతాన్ని అందిస్తుండగా, ప్రముఖ దర్శకుడు తరుణ్ భాస్కర్ సంభాషణలు రాస్తుండటం విశేషం. సందీప్ కాకర్ల మరియు కరాటే రాజు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు హిందీ, ఇంగ్లీష్, జపనీస్ మరియు స్పానిష్ వంటి అంతర్జాతీయ భాషల్లో కూడా విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నారు.





# రామమచరణ్ మేనేజర్ కొడుకు హీరోగా ఎంట్రీ

టాలీవుడ్ నుంచి హీరోల వారసులే కాకుండా, వారి వెన్నంటి ఉండే సన్నిహితుల కుటుంబాల నుంచి కూడా కొత్త టాలెంట్ వస్తుంటుంది. తాజాగా రామ్ చరణ్ డేట్స్, ఇతర సినిమా వ్యవహారాలను దశాబ్ద కాలంగా చూసుకుంటున్న ఆయన మేనేజర్ ప్రవీణ్ కుమారుడు దృషిక్ హీరోగా పరిచయం కాబోతున్నాడు. దృషిక్ చిన్నప్పటి నుంచే నటనపై ఆసక్తితో లండన్‌లోని ఒక ప్రముఖ యాక్టింగ్ స్కూల్‌లో శిక్షణ పొందినట్లు తెలుస్తుంది. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత ఆయన ఇప్పుడు ఒక క్రేజీ ప్రాజెక్ట్ ద్వారా వెండితెరకు పరిచయం కాబోతున్నారు. బ్లాక్‌బస్టర్ హిట్ సిరీస్ అయిన 'మ్యాడ్' ఫ్రాంచైజీలో రాబోతున్న 'మ్యాడ్ 3' చిత్రంలో దృషిక్ ఒక హీరోగా ఎంపికైనట్లు తెలుస్తోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న ఈ యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్‌లో దృషిక్‌కి అవకాశం రావడం విశేషం. రామ్ చరణ్‌కు అత్యంత సన్నిహితుడైన ప్రవీణ్ కుమారుడు కావడంతో, ఈ కుర్రాడికి మెగా ఫ్యామిలీ మద్దతు కూడా ఉండవచ్చని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. నటనతో పాటు డ్యాన్స్, ఫిట్‌నెస్‌లో కూడా దృషిక్ ఇప్పటికే మంచి పట్టు సాధించినట్లు సమాచారం.



# మిరాకిల్ షూట్‌లో ఎంటర్ కానున్న హెబ్బా పటేల్

టాలీవుడ్ హాట్ బ్యూటీ హెబ్బా పటేల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మిరాకిల్'. 'సత్య గ్యాంగ్', 'రౌటర్ శివ' వంటి చిత్రాలతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న ప్రభాస్ నిమ్మల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తి చేసుకున్న ఈ సినిమా, మూడో షెడ్యూల్‌ను ఈనెల 24 నుంచి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ప్రారంభించనుంది. ఈ షెడ్యూల్‌లో హెబ్బా పటేల్ షూటింగ్‌లో పాల్గొనబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. సైదా ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రమేష్ ఎగ్గిడి, శ్రీకాంత్ మొగదాసు, చందర్ గౌడ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రణధీర్ భీసు హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో సీనియర్ హీరోలు శ్రీరామ్, సురేష్ కీలక పాత్రలు పోషించడం విశేషం. ఈ చిత్రం ద్వారా నాయుడు పెండ్ర విలన్‌గా పరిచయమవుతున్నారు. గ్లామర్, యాక్షన్ కలగలిసిన ఈ చిత్రంలో సీనియర్ జర్నలిస్ట్ ధీరజ అప్పాజీ ఫోరెన్సిక్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. దర్శకుడు ప్రభాస్ నిమ్మల స్వయంగా కథ, మాటలు, స్క్రీన్ ప్లే అందించడమే కాకుండా సంగీతాన్ని కూడా సమకూర్చడం ఈ సినిమా ప్రత్యేకత. రవి బస్రూర్ వంటి దిగ్గజాల స్ఫూర్తితో రూపొందుతున్న యాక్షన్ బ్లాక్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని నిర్మాతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆమని, ఝాన్సీ, విజయ్ సూర్య వంటి భారీ తారాగణంతో రూపొందుతున్న ఈ 'మిరాకిల్' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి అద్భుతాలు సృష్టిస్తుందో చూడాలి.

Printed, Published and Owned by MOHAMMAD ABDUL RAHEMAN, and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273 Email: udyamakeratam@gmail.com. Phone No: 9030717172, 9391127717

# నేరాల ఛేదనలో పోలీస్ జాగిలాల సేవలు కీలకం

- జగిత్యాల జిల్లా ఎస్పి అశోక్ కుమార్
- ఐఐటీఏ మొయినాబాద్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న నూతన జాగిలం 'రాఖీ'



**నేటి సాక్షి, జగిత్యాల బ్యూరో,( రాధారపు నర్సయ్య ):** జగిత్యాల జిల్లా పోలీస్ విభాగానికి చెందిన 'రాఖీ' అనే నూతన పోలీస్ జాగిలం ఐఐటీఏ, మొయినాబాద్‌లో ఎనిమిది నెలల కఠిన శిక్షణను విజయవంతంగా పూర్తి చేసి జిల్లాకు చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పి అశోక్ కుమార్‌ను డాగ్ హ్యాండ్లర్ రమేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. రమేష్‌కు ఎస్పి సర్టిఫికెట్ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ, నేరాల ఛేదనలో పోలీస్ జాగిలాల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. పేలుడు పదార్థాల గుర్తింపు, మాదకద్రవ్యాల స్వాధీనం, నిందితుల గాలింపు, తప్పిపోయిన వ్యక్తుల ఆచూకీ గుర్తింపు వంటి సందర్భాల్లో జాగిలాల సేవలు అమూల్యమని తెలిపారు. ఆధునిక కాలంలో నేరస్తులు కొత్త పద్ధతులు అవలంబిస్తున్న నేపథ్యంలో శిక్షణ పొందిన జాగిలాలు పోలీస్ వ్యవస్థకు బలమైన ఆధారంగా నిలుస్తాయని అన్నారు. కఠినమైన శిక్షణతో మానసికంగా, శారీరకంగా దృఢంగా తయారైన 'రాఖీ' జాగిలం జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో సమర్థవంతంగా సేవలందిస్తుందని తెలిపారు. జాగిలాలను నిర్వహించే సిబ్బంది మరింత అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్ సైదులు, హెడ్ కానిస్టేబుల్ కూర్మరావు, కానిస్టేబుళ్లు రమేష్, నాంపల్లి పాల్గొన్నారు.

# విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలి





- పదవ తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి
- జగిత్యాల జిల్లా కలెక్టర్

**నేటి సాక్షి - కోరుట్ల,( రాధారపు నర్సయ్య ):** కోరుట్ల మండలం కల్లూరు లోని తెలంగాణ మోడల్ స్కూల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని, ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు వండుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్, వంటలు తప్పనిసరిగా గ్యాస్ పొయ్యి మీదే వండాలని సూచించారు. కూరగాయలు తాజాగా ఉండాలని, వంట సరుకుల నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ప్రిన్సిపాల్‌కు ఆదేశించారు. పాఠశాలలో వెంటనే కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసి కూరగాయల మొక్కలు నాటాలని తెలిపారు. తరగతి గదులను సందర్శించి ఉపాధ్యాయుల బోధన విధానాన్ని పరిశీలించారు. భోజన వసతులు, బోధనపై విద్యార్థులతో నేరుగా మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఉన్నత లక్ష్యాలు సాధించాలంటే క్రమశిక్షణ గల విద్య అవసరమని, విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం కోరుట్ల పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ (గర్ల్స్) పాఠశాలలో నిర్మాణంలో ఉన్న సైన్స్ ల్యాబ్‌ను పరిశీలించారు. ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ, కాంట్రాక్టర్లతో మాట్లాడి త్వరగా పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని సూచించారు. టీజీఎంఎస్ కల్లూరులో పీఎం శ్రీ పథకం కింద జరుగుతున్న మేజర్, మైనర్ పనుల పురోగతిని సమీక్షించి వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ఎస్ఎస్సి విద్యార్థులు రాస్తున్న ప్రీ ఫైనల్ పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, డీఈఓ రాము, తహసీల్దార్, ఎంపీడీవో, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యక్తి గత పరిశుభ్రత ఉంటే క్షయ వ్యాధి అరికట్టవచ్చును

- సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ కాలురి పెద్ద మస్తానయ్యా



**నేటి సాక్షి ఆత్మకూరు :** నంద్యాల జిల్లా కలెక్టర్, నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మరియు నంద్యాల జిల్లా లెప్రసీ ఎయిడ్స్ మరియు టిబి కంట్రోల్ ఆఫీసర్ గారి ఆదేశాల మేరకు ఆత్మకూర్ టీ బి యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పవన్ కుమార్ సార్ తెలిపిన విధంగా ఆత్మకూరు నందు గల జిల్లా పరిషత్ హై స్కూల్ బాలికలు హెడ్మాస్టర్ జి ఉమారాణి మరియు సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ కల్లూరి పెద్ద మస్తానయ్య వారి ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో క్షయ వ్యాధి మైక్రో బ్యాక్టీరియంటుబర్క్లోసిస్ ద్వారా ఒకరి నుండి మరొకరికి ఎడతెరిపిలేని దగ్గు, దగ్గు తో పాటు గళ్ళ పడడం, దగ్గు తో పాటు రక్తం పడడం, సాయంత్రం జ్వరం రావడం, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం, లాంటి లక్షణాలు కలవారు దగ్గరలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు గళ్ళ పరీక్ష మరియు మెడికల్ ఆఫీసర్ గారితో పరీక్ష చేయించుకుని క్షయ అని నిర్ధారణ అయిన తర్వాత మెడికల్ ఆఫీసర్ గారు తెలిపిన విధంగా డాట్ సిస్టం ద్వారా నిర్ధారించిన మాత్ర లను సరైన సమయంలో సరైన మోతాదులో తీసుకోవడం వల్ల క్షయ పూర్తిగా నయం అవుతుంది. 56 రోజులకు ఒకసారి ఐపి గల్ల పరీక్ష తర్వాత 112లకు కంటిన్యూషన్ ఫేస్ గల్ల పరీక్ష చేయించుకుని పూర్తిగా నయమైనది తెలుసుకున్న తర్వాత రెండు సంవత్సరాల వరకు ఆరు నెలలకు ఒకసారి ఫాలోఅప్ చేయించుకోవడం వల్ల క్షయ వ్యాధి పూర్తిగా నయం అవడమే కాకుండా మరలా రాదు అని నిర్ధారణ చేసుకోవచ్చు. ఈ విధంగా కాకుండా ఒక క్షయ వ్యాధిగ్రస్తుని కి మందులు వాడించకపోతే ఒక సంవత్సరంలో 15 మందికి అదేవిధంగా రెండో సంవత్సరంలో 225 మందికి మూడో సంవత్సరంలో 4000 పైగా క్షయ వ్యాధిగ్రస్తులు ఏర్పడవచ్చు అందువలన నివారించడం చాలా కష్టమవును అందువలన ప్రతి లక్షణాలను త్వరగా గుర్తించడం, క్షయ వ్యాధి లక్షణాలను గల వారిని త్వరగా గళ్ళ పరీక్ష, చేయించడం. గళ్ళ పరీక్షలో క్షయ నిర్ధారణ అయినవారికి త్వరగా డాట్ సిస్టం ద్వారా మందులు మింగించడం వలన క్షయ వ్యాధిని నివారించడంలో ప్రతి ఒక్కరం తోడ్పడుతామని సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ కల్లూరి పెద్ద వస్తానయ్య తెలియజేసినారు. స్కూల్ హెడ్మాస్టర్ జి ఉమా రాణి గారు ప్రతి ఒక విద్యార్థిని విద్యార్థులు క్షయ వ్యాధి నివారణలో విద్యార్థి పాత్రను పోషించి చేయవాది నివారణలో తోడ్పడాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తిరుమల, సునీత, చంద్రకళ, శంషాద్ బేగం, జ్యోతి కర్ణమ్మ, విజయలక్ష్మి, స్వర్ణలత, విజయభారతి, లక్ష్మీదేవి, శశికళ, రజియా భాను, మంజుల, పద్మజ, లక్ష్మీ తులసి, లక్ష్మీదేవి వరలక్ష్మి, శంకరయ్య పాల్గొన్నారు మరియు స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎంసిహెచ్ ఆసుపత్రిలో నేత్ర సదరం

## యూడీఐడీ శిబిరం పరిశీలన

- పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలి
- జగిత్యాల అదనపు కలెక్టర్ రాజా గౌడ్



**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో,( రాధారపు నర్సయ్య ):** జగిత్యాల పట్టణంలోని ఎంసిహెచ్ (మాతా శిశు ఆసుపత్రి)లో నిర్వహిస్తున్న నేత్ర సదరం–యూడీఐడీ శిబిరాన్ని గురువారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాజా గౌడ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రఘువరన్ కలిసి పరిశీలించారు. దివ్యాంగుల గుర్తింపు, ధృవీకరణ ప్రక్రియలు పారదర్శకంగా, సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మాతా–శిశు విభాగంలోని బయటిరోగుల వార్డులు, టీకాల వార్డులు, బయటిరోగుల నమోదు విభాగం, ఔషధ పంపిణీ విభాగం, ప్రయోగశాల విభాగాలను సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, సదుపాయాలను సమగ్రంగా పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఔషధాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చూడాలని, పరిశుభ్రత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. పాత ఆసుపత్రి భవనంలో కొనసాగుతున్న సదరం–యూడీఐడీ పునరుద్ధరణ పనులను పరిశీలించి పనుల నాణ్యత, వేగంపై కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. పనులు నిర్దేశిత గడువులో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. రోగులకు అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, సేవలను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంసిహెచ్ ఆసుపత్రి పరిపాలనా అధికారి వేణుకొండల్ రెడ్డి, నివాస వైద్యాధికారులు డా. మహేష్ రావు, డా. శ్రీపతి, డా. విజయ్ కుమార్ రెడ్డి మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఫార్మా రిజిస్ట్రేషన్ పై అవగాహన




**నేటిసాక్షి, తిరుమలాయపాలెం (రుద్రరాజు):** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలో ఫార్మ (ఎరువులు విత్తనాల పెస్టిసైడ్స్ రిజిస్ట్రేషన్ పై) రైతులకు అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సదస్సు నిర్వహించారు ఈ కార్యక్రమానికి వ్యవసాయ సంచాలకులు మట్టపల్లి సతీష్ మండల వ్యవసాయ అధికారి నారెడ్డి సీతారాం రెడ్డి హాజరై కార్యక్రమం ముఖ్య ఉద్దేశం గురించి మాట్లాడుతూ ప్రతి రైతు కూడా తమ ఫార్మా రిజిస్ట్రేషన్ ని ఉంచుకుంటేనే ప్రభుత్వము నుండి అందవలసిన అందుతాయని తెలియజేశారు రైతులకు నాణ్యమైన వ్యవసాయ పరికరాలు అందించడం ప్రభుత్వ లక్ష్యం నియమావళి ప్రకారం రిజిస్ట్రేషన్ లేకుండా విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మా రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లయితే కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలను ఈజీగా పొందవచ్చని అయిన తెలిపారు యూరియా పై రైతులు ఆందోళన చెందవద్దని ప్రస్తుతం అన్ని సెంటర్లలో యూరియా అందుబాటులో ఉందని యాప్ ద్వారా నమోదు చేసుకొని పొందవచ్చని యూరియా కోసం ఎవరు ఆందోళన చెందవద్దని తెలియజేశారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకులు మట్టపల్లి సతీష్ మండల వ్యవసాయ అధికారి నారెడ్డి సీతారాం రెడ్డి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# పీఆర్టీయూఅధ్యక్షుడిగా శ్రీనివాస్ రెడ్డి



**నేటిసాక్షి, కరీంనగర్:** ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్టీయూ – తెలంగాణ) కరీంనగర్ గ్రామీణ మండల అధ్యక్షుడిగా గోపాల్ పూర్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మందల శ్రీనివాస్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అయిలేని కరుణాకర్ రెడ్డి, మర్రి జైపాల్ రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించిన ఉపాధ్యాయులకు, సంఘ బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుల సంక్షేమానికి, సంఘ బలోపేతానికి తన శాయశక్తులా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నాగభూషణం, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి ప్రతినిధులు కుమారస్వామి, రాజశేఖర్ రావు, శ్రీనివాస్ రావు, ప్రభాకర్, అంజయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సంత్ సేవాలాల్ జయంతి



**నేటి సాక్షి తిరుమలాయపాలెం,(రుద్రరాజు):** ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గస్థాయి శ్రీ సంత సేవాలాల్ మహారాజ్ జయంతి ఘనంగా జరపాలని తిరుమలాయపాలెం మండల సభ ప్రచార కమిటీ కన్వీనర్ గుగులోత్ సురేష్ నాయక్ తెలిపారు ఈనెల 21 శనివారం నాడు జరిగే సంత్ సేవాలాల్ జయంతి కూసుమంచి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం సమీపంలో ఉన్న సేవాలాల్ మహారాజ్ భవన స్థలం వద్ద నిర్వహిస్తారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరవుతారు ఈ సందర్భంగా సభ ప్రచార కమిటీ కన్వీనర్ గుగులోత్ సురేష్ నాయక్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని గిరిజన సహోదరులు మరియు తిరుమలాయపాలెం మండల పరిధిలోని అన్ని గ్రామపంచాయతీలో ఉన్న లంబాడి ప్రజలు ప్రజాప్రతినిధులు సేవాలాల్ మహారాజ్ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా ఆయన కోరారు.

# రెండు స్కూటర్లు ఢీ



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి:** ఎదురుదులుగా వస్తున్న రెండు పూటలు ఢీకొని ముగ్గురు గాయపడిన సంఘటన చౌడేపల్లి మండలంలో చోటుచేసుకుంది .మడుకూరు, కందూరు ప్రధాన రహదారిలో మడుకూరు దాటగానే మార్గమధ్యంలో రెండు స్కూటర్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో స్కూటర్ రిస్టులు ముద్దేపల్లి బాలసుబ్రమణ్యం ముత్తుకూరు రమేష్ ఆరడుగుంట జయ కుమారులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని గుర్తించిన స్థానికులు 108 వాహనం ద్వారా చౌడేపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ఇక్కడ వారి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మదనపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్కు తరలించారు

# నామ్ ఎక్స్‌ప్రెస్ టోల్ ప్లాజా నిర్లక్ష్యం

## కూలీల పైకి దూసుకెళ్లిన లారీ

- కూలీల ప్రాణాలతో చెలగాటం...భద్రతా కార్డులు, ఇన్సూరెన్స్ లేని బతుకులు
- యాజమాన్యంపై మండిపడుతున్న బాధితులు








**నేటిసాక్షి, మిర్యాలగూడ :** నార్కట్‌పల్లి-అద్దంకి ప్రధాన రహదారిపై మాడుగులపల్లి మండల కేంద్రంలో జరిగిన ఘోర ప్రమాదం టోల్ ప్లాజా యాజమాన్యం యొక్క అట్టడుగు భద్రతా ప్రమాణాలకు అద్దం పడుతోంది. నామ్ ఎక్స్‌ప్రెస్ టోల్ ప్లాజా పరిధిలో పనిచేస్తున్న కూలీలపైకి లారీ దూసుకెళ్లిన ఘటనలో పలువురు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుండటం స్థానికంగా తీవ్ర ఆగ్రహాన్ని కలిగిస్తోంది.

### డబ్బు వసూళ్లపై ఉన్న శ్రద్ధ ప్రాణాలపై లేదా..?

హైవేపై పనులు జరుగుతున్నప్పుడు కనీస భద్రతా నియమాలు పాటించడంలో టోల్ ప్లాజా యాజమాన్యం పూర్తిగా విఫలమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాహనదారులను అప్రమత్తం చేసేందుకు కనీసం హెచ్చరిక బోర్డులు గానీ, బారికేడ్లు గానీ ఏర్పాటు చేయకపోవడం వల్లే ఈ ఘోరం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు వాపోతున్నారు. ఈ ప్రమాదం నేపథ్యంలో టోల్ ప్లాజా వద్ద పనిచేసే కార్మికులు, స్థానికులు యాజమాన్యం ముందు కీలక డిమాండ్లను ఉంచారు. భద్రతా కార్డులు (సేఫ్టీ కార్డ్స్ ) విధి నిర్వహణలో ఉన్న ప్రతి కూలీకి అధికారికంగా భద్రతా గుర్తింపు కార్డులు జారీ చేయాలని,

పక్కా ఇన్సూరెన్స్ హైవేపై ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న కూలీలందరికీ నామ్ ఎక్స్‌ప్రెస్ యాజమాన్యమే ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించి, బీమా సౌకర్యం కల్పించాలి ప్రస్తుతం ఆసుపత్రిలో ఉన్న బాధితుల వైద్య ఖర్చులన్నీ యాజమాన్యమే భరించాలి వారి కుటుంబాలకు భారీ నష్టపరిహారం చెల్లించాలి

### యాజమాన్యం బాధ్యత వహించాలని,

టోల్ గేట్ల వద్ద ముక్కుపిండి వసూళ్లు చేసే టోల్ ప్లాజా నిర్వాహకులు, తమ దగ్గర పనిచేసే కూలీల ప్రాణాలకు మాత్రం భద్రత కల్పించడం లేదని కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. సరైన రక్షణ కవచాలు, రిఫ్లెక్టివ్ జాకెట్లు, ఇన్సూరెన్స్ గ్యారెంటీ లేకపోతే పనులు నిలిపివేస్తామని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం మిర్యాలగూడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కూలీల పరిస్థితి విషమంగా ఉండటంతో, పోలీసులు ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన టోల్ ప్లాజా యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఆర్డీవో కార్యాలయం ఆకస్మిక తనిఖీ



- పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి
- జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**నేటి సాక్షి , కోరుట్ల( రాధారపు నర్సయ్య ):** కోరుట్ల రెవెన్యూ డివిజనల్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో నిర్వహిస్తున్న వివిధ పరిపాలనా పనుల పురోగతిని సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. జాతీయ రహదారి పనులకు సంబంధించిన అవార్డు కాపీలను త్వరగా అందజేయాలని, పెండింగ్‌లో ఉన్న ప్రక్రియలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమయానుకూలంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. మీసేవ సర్టిఫికెట్లను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు జారీ చేయాలని అధికారులకు ఆదేశించారు. ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేస్తూ, ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పని చేయాలని సూచించారు. తప్పు నమోదు జరగకుండా ప్రతి ఇంటి నుంచి ఖచ్చితమైన వివరాలు సేకరించాలని, అన్ని స్థాయిల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట కోరుట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి జీవాకర్ రెడ్డి, తహసీల్దార్లు మరియు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు సరిపడా యూరియా అందించాలి





- సొసైటీ ల్లోకి స్టాక్ వొస్తుంది...రైతులు బుక్ చేసుకునేందుకు రెడీ గా ఉండాలి

ఎమ్మెల్యే బిఎల్ఆర్

**నేటిసాక్షి, మిర్యాలగూడ :** పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నియోజకవర్గ వ్యాప్తంగా యూరియా సమస్యలపై శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, అగ్రికల్చర్ జేడీ తో కలిసి, నియోజకవర్గ వ్యవసాయ శాఖ అధికారులు, రైతులతో కలిసి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ, నియోజకవర్గంలో రానున్న వారం రోజులు చాలా కీలకం అని, కావున ఈ వారం రోజులు రైతులకు ఇప్పటివరకు ఇచ్చిన యూరియా కంటే, వ్యవసాయ శాఖ అధికారులు, అధికంగా స్టాక్ సొసైటీలలో ఏర్పాటు చేయాలని, జిల్లా కలెక్టర్ గారికి ఫోన్ ద్వారా తెలియపరచగా, వెంటనే సానుకూలంగా స్పందించిన కలెక్టర్, రైతులతో మాట్లాడుతూ, రానున్న వారం రోజులు రైతులకు సరిపడే యూరియాను అందిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే బిఎల్ఆర్ తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ, రైతులు ఈ వారం రోజులు అప్రమతంగా ఉంటూ, ఈ అవకాశాన్ని సాధ్వినియోగం చేసుకొని, యూరియాను బుక్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాత్రి 12 వరకు షాపులకు అనుమతి ఇవ్వాలని వినతి



**నేటి సాక్షి,కోరుట్ల:** రంజాన్ మాసం దృష్ట్యా కోరుట్ల పట్టణంలోని దుకాణాలను రాత్రి 12 గంటల వరకు తెరిచి ఉంచేలా అనుమతి ఇవ్వాలని మున్సిపల్ వైస్ చైర్మన్ షాహిద్ ఉల్ అహద్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. ఉపవాస దీక్షల అనంతరం రాత్రి వేళల్లో కొనుగోళ్లు అధికంగా ఉంటాయని, సమయం పొడిగింపు వల్ల ప్రజలకు సౌకర్యంతో పాటు చిన్న వ్యాపారులకు మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మార్కెట్ ప్రాంతాల్లో భద్రత, పారిశుద్ధ్య ఏర్పాట్లు పటిష్టం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిజ్వాన్, కిజార్, అజార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంజాయ్ మెంట్ సర్వే నిర్వహణ



**నేటి సాక్షి - కోరుట్ల, ( రాధారపు నర్సయ్య ):** కోరుట్ల పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయానికి చెందిన అయిలాపూర్ రోడ్‌లో ఉన్న భూముల సర్వే నంబర్లు 1399/1, 1499, 1505, 1521 వంటి పడావ్ భూములపై 'ఎంజాయ్‌మెంట్ సర్వే' (ఆనందించే హక్కు/ప్రస్తుత వినియోగ సర్వే) నేడు నిర్వహించబడింది. ఈ సర్వేను ఆరుద్ధ మండల సర్వేయర్ జి. కుమారస్వామి ఆధ్వర్యంలో, కోరుట్ల మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రవీణ్, సూర్యరేఖ గాండ్లతో కలిసి నిర్వహించారు. సర్వేలో దేవాలయ ఎక్సిక్యూటివ్ ఆఫీసర్ (జూ) ఎం. విక్రమ్, ఆలయ చైర్మన్ ఎతిరాజం నర్సయ్య, ధర్మకర్తలు నేతి శ్రీనివాస్, కటుకం దివాకర్, తోట గంగాధర్, గొడికె రాములు, చిలువేరి విజయ్ కుమార్, పద్మ, దర్శయ్య, ఆర్. గంగాధర్, కె. రాజేంద్ర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సర్వే ద్వారా దేవాలయ ఆస్తుల సరైన స్థితి, వినియోగం, హక్కులను ధ్రువీకరించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. దీని ఫలితాల ఆధారంగా భవిష్యత్ చర్యలు చేపట్టే అవకాశం ఉంది.

# ఘనంగా సరస్వతి హోమం



**నేటి సాక్షి చిలుకూరు :** చిలుకూరు మండల కేంద్రంలో గ్లోబల్ ఇంటర్నేషనల్ పాఠశాలలో సరస్వతి హోమం చేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులు చిలుకూరు మండల పరిధిలో గల గ్లోబల్ ఇంటర్నేషనల్ పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి చదువుల తల్లి సరస్వతి హోమం వరంగల్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతి విగ్రహం వద్ద ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సత్యనారాయణ ప్రిన్సిపాల్ ఉపేందర్ ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు...

# పశువులకు గర్భకోశ మందులు



**నేటి సాక్షి చిలుకూరు:** చిలుకూరు మండలంలోని నారాయణపురం గ్రామంలో పశువులకు గర్భ కోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని గ్రామ సర్పంచ్ శ్రీమతి మండవ జయమ్మ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పశువుల వైద్యాధికారి డాక్టర్ వీరారెడ్డి ఆధ్వర్యంలో సుమారు 40 పశువులకు వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ గంద్ర లింగస్వామి పశు వైద్య ఉపకేంద్ర సిబ్బంది శ్రీమతి నీరజ, సూపర్వైజర్ సైదులు గోపాలమిత్రాలు నరేష్ అశోక్ వెంకటేష్,రామకృష్ణ, రమేష్ మరియు రైతులు పాల్గొన్నారు.

# ఎంపీ రఘురాం రెడ్డి జన్మదినం



**నేటి సాక్షి తిరుమలాయపాలెం,(రుద్రరాజు):** ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం ఖమ్మం ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్ ఏర్పాటుచేసిన భారీ కేక్ ను టిపిసిసి ప్రధాన కార్యదర్శి మద్దినేని స్వర్ణకుమారి మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు తుమ్మల యుగంధర్ యదులాపురం మున్సిపల్ చైర్పర్సన్ పి అనిత వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్ మరియు తదితరులు పాల్గొని కేక్ కట్ చేశారు అనంతరం వందమంది ఆటో డ్రైవర్లకు కాకి చుక్కలను పంపిణీ చేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ రామసహాయం రఘురామరెడ్డి గొప్పతనం గురించి మాట్లాడుతూ వారి మాటల్లో నిబద్ధత చేతల్లో పారదర్శకత కలిగిన గొప్ప నాయకుడు రఘురాంరెడ్డి ఎంపీ పదవిని ఒక బాధ్యతగా భావించి తన సమర్థ నాయకత్వంతో ఖమ్మం భద్రాద్రి, కొత్తగూడెం జిల్లాలో చెరగని ముద్ర వేసుకుంటున్నారని ప్రజల దీవెనలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ యార్లగడ్డ హనుమంతరావు మాజీ మార్కెట్ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్ మాజీ డిసిసి అధ్యక్షులు పువ్వాల దుర్గాప్రసాద్ కాంగ్రెస్ నగర అధ్యక్షులు దీపక్ చౌదరి ప్రముఖ న్యాయవాది స్వామి రమేష్ కుమార్ టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ఇమామ్ భాయ్ రంజిత్ నాయక్ స్ఫూర్తి ఓం రాధాకృష్ణ ఓబీసీ సేల్ వైస్ చైర్ పర్సన్ హారిక నాయుడు నాయకులు లింగాల రవికుమార్ వడ్డెబోయిన నరసింహారావు చల్లా రామకృష్ణారెడ్డి శ్రీ కళా రెడ్డి మొగిలిచర్ల సైదులు చింతమల్ల గురుమూర్తి కరాటే వేణు విప్లవ కుమార్ పలువురు కార్పొరేటర్లు సర్పంచ్ లు అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## తిగుల్‌లో చత్రపతి జయంతి



**నేటిసాక్షి, జగదేవపూర్** :మండలంలో తిగుల్ గ్రామంలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. అలాగే విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ చేశారు. శివాజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పిఏసిఎస్ మాజీ డైరెక్టర్ భూమయ్య మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు శివాజీ మహారాజ్ చేసిన సేవలు ఎనలేనివని తన రాజ్యంలోని ఆడవాళ్ల అందరిని మరియు తన శత్రురాజ్య స్త్రీలను తన తోబుట్టువులుగా భావించి పసుపు, కుంకుమ, చీరలు ఇచ్చేవారని అలాంటి ధీరుడు భరతఖండంలో జన్మించడం మన అదృష్టంగా భావించాలని అన్నారు. త్వరలోనే విగ్రహం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రజిత, ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు వివిధ పార్టీల నాయకులు శివాజీ యూత్ సభ్యులు గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తి అదృశ్యం



**నేటి సాక్షి-మేడిపల్లి:** మేడిపల్లి మండలం కట్లకుంట గ్రామానికి చెందిన గుండంపల్లి శంకర్ 36 సం,,లు గత శుక్రవారం అత్తగారు గ్రామం మెట్‌పల్లికి వెళ్లి బార్య పిల్లలతో కలసి తిరిగి కట్లకుంట వెలుతున్నని చెప్పి తిరిగి స్వగ్రామానికి రాకుండా తప్పిపోయినాడు,ఈ వ్యక్తి కనబడ్డ వారు ఈ క్రింది నెంబర్లకు ఫోన్ చేయగలరు , 9908281314, 9603859865

## చందాపూర్‌లో శివాజీ జయంతి




**నేటి సాక్షి తొగుట.. (వడ్డే నరసింహులు):** భారత వీరత్వానికి ప్రతీక.భారత జాతి సగర్వంగా చెప్పుకునే ధీరుడు.మొఘల్ సామ్రాజ్య పతనాన్ని శాసించి.మరాఠా సామ్రాజ్యపు వెలుగుల్ని విస్తరింపచేసిన యోధుడు.. యువతరానికి ఎప్పటికీ పౌరుషాగ్నిని రగిలించే దిక్సూచి శ్రీ చత్రపతి శివాజీ మహారాజ్. శ్రీ ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా గ్రామ సర్పంచ్ చంద లావణ్య స్వామి , ఉప సర్పంచ్ ఆత్మకూరీ శ్రీకాంత్ యాదవ్ మరియు చందాపూర్ గ్రామ యువకులు, శుభాకాంక్షలు తెలపడం జరిగింది చందాపూర్ గ్రామంలో వీధిలో బైక్ ర్యాలీ తీయడం జరిగింది భారీ ఎత్తున గ్రామ ప్రజలు యువకులు పాల్గొనడం జరిగింది

## డైరీ ఆవిష్కరన



**నేటి సాక్షి వికారాబాద్ :** వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో డిఎంహెచ్వో డాక్టర్ స్వర్ణ కుమారి చేతుల మీదుగా తెలంగాణ హెల్త్ ఎడిటర్స్ మీడియా ఆఫీసర్స్ అసోసియేషన్ 2026 డైరీ క్యాలెండర్ ను ఆవిష్కరించడం జరిగిశీది. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు డాక్టర్ స్వర్ణ కుమారికి పుష్పగుచ్చము శాలువాతో సన్మానించడం జరిగిశీది. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ పవిత్ర, డాక్టర్ వరలక్ష్మి డిప్యూటీ డెమో శ్రీనివాసులు, జిల్లా పరిధిలోని హెల్త్ ఎడ్యుకేటర్ లు పాల్గొనడం జరిగినది. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తెలంగాణ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ను ఆవిష్కరించడం జరిగిశీది. ఈ కార్యక్రమంలో టీజీ పి ఓ ఏ అధ్యక్ష ,కార్యదర్శులు శ్రీమతి మలియా ఫరాన్, మహేష్ జే. అశోక్ , విజయ కుమారి, రాజేశ్వర్ రెడ్డి, రవికుమార్ తో పాటుగా జిల్లా పరిధిలోని అందరు ఫార్మసిస్టులు పాల్గొన్నారు.

## రైతు బజార్ అభివృద్ధికి కృషి



**నేటి సాక్షి, వికారాబాద్ :** వికారాబాద్ రైతు బజార్‌ను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ సుధీర్ మరియు మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం శ్రీ అనన్యలతో కలిసి ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్న వారు, మార్కెట్‌లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ సహకారంతో త్వరలోనే అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని చైర్మన్ వెల్లడించారు. వికారాబాద్ అభివృద్ధిలో భాగంగా రైతు బజార్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మరియు అధికారులు పాల్గొన్నారు.

# మౌలిక వసతుల పనుల్లో వేగం పెంచాలి

## వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.

**నేటి సాక్షి వికారాబాద్ :**వికారాబాద్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, స్వయం సహాయక సంఘాల భవన నిర్మాణ పనులను యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుండి ఎంపీడీఓలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మన ఊరు-మన బడి కింద చేపట్టిన అదనపు తరగతి గదులు, శౌచాలయాలు, తాగునీరు కాంపౌండ్ వాల్స్ నిర్మాణాలను త్వరగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించడం ద్వారా విద్యార్థుల హాజరు శాతంతో పాటు తల్లిదండ్రులలో నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు. అలాగే, మహిళల ఆర్థిక స్వావలంబన కోసం నిర్మిస్తున్న ఎస్ ఏచ్ జి భవనాల పనుల్లో నాణ్యత పాటించాలని, నిధులు మంజూరైన పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా పారదర్శకంగా పనులు పూర్తి చేయని యెడల చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, డీపీఓ జయసుధ, డీఈఓ రేణుకా దేవి తదితరులు పాల్గొన్నారు.

# రైతు బజారులో మౌలిక సదుపాయాలు కల్పనకు చర్యలు



**నేటి సాక్షి వికారాబాద్ :** వికారాబాద్ పట్టణ కేంద్రంలోని రైతు బజారును ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు, విక్రయదారులతో రైతు బజారులోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవి, వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని కనీస వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. రైతు బజారులో టాయిలెట్లు, షెడ్ల ఏర్పాటుతోపాటు నీటి సౌకర్యం కల్పించాలని అధికారులకు సూచించారు. వర్షపు నీరు రైతు బజార్ లోకి రాకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ సుధీర్, మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య, వైస్ చైర్మన్. అర్థ సుధాకర్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉమేష్, మార్కెటింగ్ అధికారి సారంగపాణి, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు

# క్వాంటిటేటివ్ మెథడ్స్‌తోనే భవిష్యత్తు తరాలకు ఉపాధి

## ప్రొఫెసర్ టి.ఎల్.ఎన్. స్వామి





**నేటిసాక్షి మిర్యాలగూడ:** క్వాంటిటేటివ్ మెథడ్స్ (ుబఋఅ-ౌఊఅజవ వీవ్‌ష్ట్రశీం) మాత్రమే భవిష్యత్తు తరాలకు సరైన ఉపాధిని అందిస్తాయని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ టి.ఎల్.ఎన్. స్వామి అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని కె.ఎన్.ఎమ్ (KNM) ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, పి.ఎం. ఉషా (PMUSHA) ఆధ్వర్యంలో అర్థశాస్త్ర విభాగం నిర్వహిస్తున్న మూడు రోజుల జాతీయ స్థాయి వర్క్ షాప్ గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ టి.ఎల్.ఎన్. స్వామి మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) యుగంలో, కేవలం సిద్ధాంత పరమైన బోధనతో ఎక్కువ కాలం మనుగడ సాధ్యం కాదని పేర్కొన్నారు. ప్రభుత్వ డేటా నిర్వహణ మరియు విశ్లేషణ సందర్భాలలో ప్రతి అధ్యాపకుడు క్వాంటిటేటివ్ మెథడ్స్ పైన స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ విజిటింగ్ ప్రొఫెసర్ ఎస్. ఇంద్రకాంత్ మాట్లాడుతూ.. ఆర్ట్స్ విద్యార్థులకు గణితం మరియు గణాంక శాస్త్రం (Statistics) పట్ల ఉన్న భయాన్ని పోగొట్టడమే ఉపాధ్యాయుల ప్రధాన కర్తవ్యం అని తెలిపారు. వర్క్ షాప్ డైరెక్టర్ మరియు అర్థశాస్త్ర విభాగం హెచ్.ఓ.డి డాక్టర్ గుమ్మడి నరేష్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో ఉన్నప్పటికీ, ఈ కళాశాల అత్యున్నత స్థాయి పరిశోధన పద్ధతులను అధ్యాపకులకు అందిస్తోందని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులకు మరింత సులభంగా పాఠాలు బోధించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ భీమార్జున రెడ్డి, సి.పి.డి.సి సభ్యులు బండా రాఘవ రెడ్డి, మరియు మాజీ ప్రిన్సిపాల్ ప్రభాకర్ రావు ఈ వినూత్న కార్యక్రమాన్ని తలపెట్టిన అర్థశాస్త్ర విభాగాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ వర్క్ షాప్ నిర్వహణకు ఆర్థిక సహకారాన్ని అందించిన పి.ఎం. ఉషా స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సౌందర్య జోసెఫ్, ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తంలకు డాక్టర్ గుమ్మడి నరేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన అర్థశాస్త్ర మేధావులు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# తుమ్మలూరులో ప్రారంభానికి సిద్ధమవుతున్న అంబేద్కర్ విగ్రహం

**నేటి సాక్షి కృష్ణారావు పేట:** అంబేద్కర్ విగ్రహానికి తుదిమెరుగులు భారత రాజ్యాంగ నిర్మాత న్యాయ కోవిదుడు సామాజిక సంఘసంస్కర్త దళితుల హక్కుల సామాజిక న్యాయం కోసం అవిశ్రాంతిగా పోరాడి మనువాద సిద్ధాంతాన్ని తరిమికొట్టి అంటరానితనాన్ని రూపుమాపిన మహానుభావుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం పూనం ప్రతిష్టకు మరియు ప్రారంభానికి సిద్ధమవుతుంది వివరాల్లోకెళ్తే మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామంలో ఆదర్శ యువజన సంఘం మరియు గ్రామ సర్పంచ్ వి ప్రసాద్ ఆధ్వర్యంలో పనులు చక చక వేగంగా జరుగుతున్నాయి గతంలో ఇక్కడ అంబేద్కర్ విగ్రహం ఉండేదని అయితే ఎన్ హెచ్ 340ఐ నేషనల్ హైవే పోవడంతో విగ్రహం తొలగించారని ఇప్పుడు మరల అంబేద్కర్ విగ్రహాన్ని ప్రారంభించేందుకు పనులు వేగంగా జరుగుతున్నాయి తొందరలోనే విగ్రహాన్ని ప్రారంభం కానుందని తెలుస్తోంది అన్ని పరిస్థితులు అనుకూలిస్తే దాదాపు



15 రోజుల తర్వాత ఉండే అవకాశం ఉంది ఆ మహానుభావుడు బిఆర్ అంబేద్కర్ విగ్రహం ప్రారంభానికి సిద్ధమవుతుండడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు ఏది ఏమైనా మరల రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం తుమ్మలూరు గ్రామంలో పునం ప్రతిష్టించి ప్రారంభించడానికి సిద్ధంగా ఉండడం విశేషంగా చెప్పవచ్చు

## మేనేజ్‌మెంట్‌'పై అవగాహన





**నేటి సాక్షి నల్లగొండ:** స్థానిక నాగార్జున ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాల (NG College)లో ప్రభుత్వ పాలనా విభాగం ఆధ్వర్యంలో 'న్యూ పబ్లిక్ మేనేజ్‌మెంట్' అనే అంశంపై గురువారం విస్తృత ఉపన్యాసం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అంతటి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హయత్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గీతా నాయక్ విస్లావత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆర్థిక సంస్కరణల్లో భాగంగా సంప్రదాయ పద్ధతులను వీడి ఆధునిక నిర్వహణ పద్ధతులను అనుసరించడం ద్వారానే దేశం ఆర్థికంగా అగ్రగామిగా మారుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ మునిస్వామి, అకాడమిక్ కో-ఆర్డినేటర్ బత్తిని నాగరాజు, విభాగాధిపతులు బట్టు కిరీటం, అదే మల్లేశం, నర్సింగ్ కోటయ్య, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# జస్ట్.. 'నామ్ కే వాస్తే'!




- మున్సిపాలిటీలో 'వార్డు కమిటీ'లు ఏర్పాటు 'పేపర్ మీదే'నా.?
- ఏడాదికి 'నాలుగు మీటింగ్'లు పెట్టాలనేది 'చట్టం'
- ఏడాదికి 'ఒక్క మీటింగ్' కూడా పెట్టిన పాపాన పోలేదు ఈ మున్సిపల్ 'చుట్టాలు'
- 'వార్డు కమిటీ'లు ఎక్కడ? 'వార్డు ఆఫీసర్ల' జాడ ఏడ?
- 'వార్డు కమిటీ'ల మీటింగ్'కయ్యే 'ఖర్చులు' ఎవరి జేబుల్లోకి.!?

'తిలా పాపం తలా పిడికెడు' అన్నట్టు మున్సిపల్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం 'చట్టరీత్యా' ఏర్పాటు చేసిన 'వార్డు కమిటీ'లు ఏదో 'జస్ట్..నామ్ కే వాస్తే' గా పేపర్ మీద మాత్రమే ఏర్పాటు చేస్తున్నారు.! మున్సిపల్ 'చట్టం ప్రకారం' ఏడాదికి నాలుగు మీటింగ్'లు పెట్టాలనేది నిబంధన ఉన్నప్పటికీ..పాలకవర్గం 'జేబులు నింపుకునే' మనస్తత్వం..తమ 'దోచుకునే బుద్ధి' బహిర్గతం కావొద్దన్న కుట్రపూరిత ఆలోచన కారణంగా 'వార్డు కమిటీ'ల సమావేశం ఊసెత్తడం లేదు. పైగా..వార్డుల్లో పెట్టని మీటింగ్ లు పెట్టినట్టు.. చేయని ఖర్చులు చేసినట్టు.. ప్రజలకు తెలీని ఈ 'వార్డు కమిటీ'ల యవ్వారాన్ని 'కౌన్సిలర్'లు గుట్టుచప్పుడు కాకుండా 'గుటకాయ స్వాహా' చేసేసి మూతులు తుడిచేసుకుంటున్నారు.!

- నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)

## వార్డుల్లో సమస్యల పరిష్కారం కోసం ఓ వేదిక


మున్సిపాలిటీలలో ప్రజల సమస్యలను స్థానికంగా పరిష్కరించడానికి రూపొందించిన వార్డు కమిటీలు, రాజ్యాంగ 74వ సవరణతో మొదలై, తెలంగాణ మున్సిపాలిటీస్ యాక్ట్ 2019 ద్వారా బలపడ్డాయి. ఈ కమిటీలు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఏర్పడ్డాయి, కానీ అమలులో రాజకీయ ప్రభావాలు, వనరుల లోపం మరియు అవగాహన లేకపోవడం వల్ల చాలా చోట్ల రెగ్యులర్‌గా నిర్వహించబడటం లేదు.

## అసలు ఈ 'వార్డు కమిటీలు' అంటే ఏమిటి.?

మున్సిపాలిటీలలో వార్డు కమిటీలు, పట్టణ ప్రాంతాల అభివృద్ధి మరియు సేవల అమలును స్థానిక స్థాయిలో మరింత సమర్థవంతంగా చేయడానికి రూపొందించబడిన చిన్న పరిపాలనా యూనిట్లు. ఇవి మున్సిపాలిటీని చిన్న వార్డులుగా విభజించి, ప్రతి వార్డుకు సంబంధించిన సమస్యలను (రోడ్లు, నీటి సరఫరా,ఇతర సమస్యల మేనేజ్‌మెంట్ వంటివి) స్థానికంగా పరిష్కరించడానికి సహాయపడతాయి. భారత రాజ్యాంగం 74వ సవరణ (1992) ద్వారా స్థానిక స్వపరిపాలనలకు రాజ్యాంగ స్థితి ఇవ్వబడిన తర్వాత, ఈ కమిటీలు ప్రజాసమీక్షణ (Participatory Democracy)ను పెంచడానికి ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. తెలంగాణలో, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ వంటి చిన్న మున్సిపాలిటీలలో ఇవి మరింత ప్రాముఖ్యత పొందాయి. ఈ కమిటీలు ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల వర్తింపు, భౌతిక అభివృద్ధి పనుల వంటి ప్రధాన కార్యక్రమాల అమలుకు సహాయపడుతున్నాయి, కానీ పూర్తి స్థాయిలో అమలు జరగడం లేదు.

## వార్డు కమిటీల చరిత్రాత్మక పరిణామం

అసలూ ఈ 'వార్డు కమిటీ'ల ఆలోచన 19వ శతాబ్దం బ్రిటిష్ కాలంలో మొదలైంది. ఇవి తొలుత ఇండియాలో ముంబై మరియు కోల్‌కతాలో 'వార్డు-ఆధారిత పరిపాలన'లు ఏర్పడ్డాయి. స్వాతంత్ర్యానంతరం, 1950లలో పంచాయతీ రాజ్ వ్యవస్థ గ్రామీణ ప్రాంతాలకు విస్తరించగా, పట్టణాలకు 74వ రాజ్యాంగ సవరణ (1992) ద్వారా ఆధునిక రూపం వచ్చింది. ఈ సవరణ రాజ్యాంగం 243-= మరియు 243-ూ విభాగాల ద్వారా మున్సిపాలిటీల రచన మరియు వార్డు కమిటీల ఏర్పాటును నిర్దేశించింది. ఇక తెలంగాణలో, 2014 రాష్ట్ర విభజన తర్వాత, పాత చట్టాలు (Telangana Municipalities Act, 1965.. Telangana Municipal Corporations Act, 1994) రద్దు చేసి, 2019లో తెలంగాణ మున్సిపాలిటీస్ యాక్ట్ (Act No.11 of 2019) ఏకీకృత చట్టంగా తీసుకువచ్చారు. ఈ చట్టం +HMC తప్ప మిగిలిన అన్ని మున్సిపాలిటీలకు వర్తిస్తుంది. ఈ చట్టం 2019 జూలై 23 నుండి అమలులోకి వచ్చింది. తెలంగాణ మున్సిపాలిటీస్ యాక్ట్, 2019లో మొత్తం 68 సెక్షన్లు, 7 చాప్టర్లు ఉన్నాయి. 'సెక్షన్ 20' ప్రకారం, ప్రతి మున్సిపాలిటీలో వార్డు కమిటీలు ఏర్పాటు చేయాలి. ఇది 74వ సవరణకు అనుగుణంగా, 1993 నుండి మొదలైన ప్రక్రియలో భాగం. 2025లో Act No. 17 శీట 2025 (dated 15-04-2025) ద్వారా సవరణలు జరిగాయి, ఇవి రూల్స్, నోటిఫికేషన్లను మరింత స్పష్టం చేశాయి. ఈ చట్టాలు మహిళలు, SC/ST, OBCలకు రిజర్వేషన్ (సీట్లలో 1/3), గ్రీన్ యాక్షన్ ప్లాన్ (సెక్షన్ 24) వంటి అంశాలను కలిగి ఉన్నాయి. ఏర్పాటు 1990ల చివరి నుండి మొదలై, 2019 చట్టంతో పూర్తి అమలు జరిగింది.




## మరి.. వారు ఏం చేయాలి? ఏం చేస్తున్నారు?

ఈ వార్డు కమిటీల పనులు 74వ సవరణలోని 18వ అనుబంధం ప్రకారం నిర్దేశించబడ్డాయి. ఇవి స్థానిక అభివృద్ధి ప్రాజెక్టులను పరిశీలించి, మున్సిపాలిటీకి సిఫార్సులు చేయడం, వార్డు సభలు నిర్వహించి ప్రజల అభిప్రాయాలను సేకరించడం, మరియు పర్యవేక్షణ చేయడం. తెలంగాణ మున్సిపాలిటీస్ యాక్ట్, 2019 ప్రకారం, ఇవి రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, నీటి సరఫరా, గార్బేజ్ కలెక్షన్ వంటి సేవలపై దృష్టి పెడతాయి. అలాగే.. ఆరోగ్యం, విద్య, పర్యావరణ సంరక్షణ, మరియు స్వచ్ఛ భారత్, స్మార్ట్ సిటీల వంటి కార్యక్రమాల అమలు చేయడంలో కీలకపాత్ర పోషిస్తారు. వార్డు సభలు (సంవత్సరానికి కనీసం 4 సార్లు) ప్రజలు (నమోదైన ఓటర్లు) పాల్గొనేలా చేసి, సమస్యలు చర్చించే అవకాశం ఇస్తాయి.

## సభ్యుల ఎంపికలో రిజర్వేషన్, బాధ్యతలు.!

ఈ 'వార్డు కమిటీ'ల సభ్యుల ఎంపికలో 74వ సవరణ ప్రకారం మహిళలకు 1/3 సీట్లు, వెనుకజాతులకు (SC/ST/OBC) రిజర్వేషన్ ఉంటుంది. ఇది ప్రజాప్రతినిధిత్వాన్ని బలోపేతం చేస్తుంది. సభ్యులు స్థానిక ప్రజల నుండి ఎంపిక చేయబడతారు. వారి బాధ్యతలు వార్డు సమస్యలను గుర్తించడం మరియు మున్సిపాలిటీకి సిఫార్సులు చేయడం. అదే విధంగా వార్డు ఆఫీసర్లు కూడా సహాయపడతారు, ఇవి 2023లో ప్రభుత్వ ఆదేశాలతో ఏర్పడ్డాయి. వార్డు ఆఫీసర్లు (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు, ఇంజినీర్లు, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు) మున్సిపాలిటీ జోనల్ ఆఫీసులకు రిపోర్ట్ చేస్తారు. వీరు తప్పనిసరిగా కమిటీలతో కలిసి పనిచేస్తారు.

## ఈ 'వార్డు కమిటీ'ల్లో ఎవరెవరు ఉంటారు?


ఈ వార్డు కమిటీలు మున్సిపాలిటీలోని ప్రతి వార్డుకు సంబం ధించినవి. వాటి రూపకల్పన రాష్ట్ర చట్టాలపై ఆధారపడి ఉంటుంది. తెలంగాణ మున్సిపాలిటీస్ యాక్ట్, 2019 ప్రకారం, చైర్మన్‌గా ఆ వార్డు నుండి ఎన్నికైన మున్సిపల్ కౌన్సిలర్ ఉంటారు. సభ్యుల సంఖ్య సాధారణంగా 10-20 మందితో రూ పొంది ఉంటుంది. ఇందులో యూత్, మహిళలు, సీనియర్ సిటిజన్స్, NGO ప్రతినిధులు, స్థానిక నాయకులు నామినేట్ చేయబడతారు. మున్సిపాలిటీ కమిషనర్ లేదా చైర్మన్ కమిటీని ఏర్పాటు చేస్తారు, సభ్యులు 5 సంవత్సరాల కాలం కోసం నియమితులవుతారు. కొన్ని చోట్ల, ప్రజలు డైరెక్ట్ ఎన్నికల ద్వారా సభ్యులను ఎంచుకోవచ్చు. తెలంగాణలోని చిన్న ము న్సిపాలిటీలలో, ప్రతి వార్డుకు విడిగా కమిటీలు ఉంటాయి, 2025లో మున్సిపాలిటీల విస్తరణ తర్వాత మరింత చిన్న యూనిట్లుగా మారాయి.

## ప్రస్తుత అమలు, ప్రభావం

ప్రాక్టికల్‌గా, కమిటీలు తెలంగాణలో గల చిన్న చిన్న మున్సిపాలిటీలలో అక్కడక్కడా ఇందిరమ్మ ఇళ్లు, వ్యాక్సినేషన్ వంటి ప్రత్యేక కార్యక్రమాలకు మాత్రమే సహాయపడుతున్నాయి. అయితే, అవి పూర్తి స్థాయిలో అమలు లేకపోవడం వల్ల ప్రజల పాల్గొనటం తక్కువగా ఉంది. 2025లో మున్సిపాలిటీల విస్తరణ తర్వాత, కొత్త ప్రతిపాదనలు వచ్చే అవకాశం ఉంది.

## వార్డు కమిటీల నిర్వహణకు ఎంత ఖర్చు అవుతుంది.?

వార్డు కమిటీలు, సభల నిర్వహణకు స్పెసిఫిక్ బడ్జెట్ అల్లాకేషన్ విడిగా లేదు. ఇవి మున్సిపాలిటీల యొక్క అడ్మినిస్ట్రేటివ్, డెవలప్‌మెంట్ ఖర్చుల్లో భాగం. 2025-2026 మున్సిపాలిటీల బడ్జెట్ సాధారణంగా రాష్ట్ర గ్రాంట్స్, స్థానిక రెవెన్యూపై ఆధారపడి ఉంటుంది, మరియు 2026-2027 డ్రాఫ్ట్‌లలో మరింత పెరిగిన అంచనాలు ఉన్నాయి. ఇందులో మీటింగ్స్ (ప్రకటనలు, వెన్యూ, డాక్యుమెంటేషన్) కోసం ఒక్కో సభకు రూ.5,000 నుండి రూ. 20,000 వరకు ఖర్చు అవుతుంది. ఇక 'వార్డు ఆఫీసర్ల'కు జీతాలు కూడా ఇస్తారు. ఫీల్డ్ ఆఫీసర్లకు రూ.2,17,305 నుండి రూ.2,22,586 నెలకు, మరియు కౌన్సిలర్లకు రూ.7,800 ం అలవెన్స్. తెలంగాణ ప్రభుత్వం మున్సిపాలిటీలకు గ్రాంట్స్ ఇస్తుంది. ఖర్చులు "అడ్మినిస్ట్రేటివ్ ఎక్స్‌పెండిచర్" లేదా "కమ్యూనిటీ డెవలప్‌మెంట్" కేటగిరీలలో వస్తాయి. అయితే, అమలు బలహీనంగా ఉండటం వల్ల, ఈ సొమ్ములు పూర్తిగా వాడకుండా లేదా 'కౌన్సిలర్లు' స్వప్రయోజనాల కోసం ఉపయోగించుకున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పాలకుల ప్రభావాల వల్ల కౌన్సిలర్లు లేదా అధికారుల జేబుల్లోకి వెళ్లవచ్చు.. ఎందుకంటే ట్రాన్స్‌పరెన్సీ లేకపోవడం మరియు ఆడిట్‌లు బలహీనంగా ఉండటం వల్ల అని విమర్శిస్తున్నారు.




## రెగ్యులర్ నిర్వహణ లేకపోవడానికి కారణాలు.!

వార్డు కమిటీలు మరియు సభలు చట్టం ప్రకారం సంవత్సరానికి 4 సార్లు జరగాలి, కానీ తెలంగాణలోని చిన్న మున్సిపాలిటీలలో అవి అరుదుగా జరుగుతున్నాయి. ప్రధాన కారణాలు.. అడ్మినిస్ట్రేటివ్ డిలేలు (ఉదా: ఎలక్షన్స్ తర్వాత కమిటీలు ఆలస్యం), వనరుల లోపం (బడ్జెట్, సిబ్బంది), ప్రజలకు అవగాహన లేకపోవడం, మరియు రాజకీయ ప్రభావాలు (కౌన్సిలర్లు పార్టీ వర్క్ పై ఫోకస్). వార్డు ఆఫీసులు (బ్యూరోక్రాట్స్ చేత నడిపే) సభల స్థానంలో వచ్చాయి, ఇవి ప్రజలు పాల్గొనటాన్ని తగ్గిస్తుంది. చట్టపరమైన లోపాలు.. ఉద్ధ్యశ్య పూర్వకంగానే అమలు చేయకుండా వార్డు సభలు బలహీన పడ్డాయని అంటున్నారు.

